గీతల జైత్రయాత్ర

"మంచిపని చేయువాడు ఎన్నటికిని దుర్గతిపాలుగాడు"
-గీత (6-40)

లేఖకులు :
మహాయోగి రాచకొండ వెంకట నరసింహ శర్మగారు

ప్రచురణ :
అవ్యయాశ్రమము
దువ్వ, (ప॥ గో॥ జిల్లా)

ప్రథమ ముద్రణ
2000 ప్రతులు
1994

మూల్యము : రు. 5-00 లు

ప్రతులకు :
పి. వి. ఆర్. ఎన్. శర్మ
7–12 మల్లోజు వీధి
వేణుగోపాలస్వామి దేవాలయం దగ్గర
దువ్వ
ప॥ గో॥ జిల్లా. 534 156

ముద్రణ :
వెంకట్రాయ ప్రింటర్స్
తణుకు

విషయసూచిక

పరిచయము

వేదమంత్రాన్ని పఠించేటపుడు దానిని అంతర్దృష్టితో చూసి బహిరంగపరచిన ఋషిని గూర్చి తెలుసుకోవాలంటుంది ఆర్షసాంప్రదాయం. వేదాలసారమే శ్రీమద్భగవద్గీత. దానిపై అద్భుతమైన ఈవ్యాసాన్ని వెలువరించినవారు రాచకొండ వెంకట నరసింహశర్మగారు. వీరిని మేమంతా "మాష్టారు" అని పిలిచేవాళ్ళం. వీరొక మహర్షి. మహాయోగి. స్థితప్రజ్ఞులు. వీరి జీవిత చరిత్ర మాకంతగా తెలియదు. తెలిసినంత వరకు సూక్ష్మంగా చెప్పటానికి చేసే ప్రయత్నమేయిది.

తల్లిదండ్రులు

మాష్టారి తండ్రి శ్రీ అన్నయ్యశాస్త్రి. వీరి స్వస్థలం విశాఖపట్నం జిల్లాలోని కశింకోట. తల్లి శ్రీమతి నరసమాంబ. ఉద్యోగరీత్యా శాస్త్రిగారు వారణాసిలో స్థిరపడ్డారు. వీరు మహాపండితులు. రాజయోగి.

నరసమాంబగారు మహాసాధ్వి. తపస్విని. రోజుకొక ముద్ద చొప్పున ఆహారాన్ని తీసుకొంటూ రెండు మూడు నెలలు దీక్షతో సాధన చేసేవారు. విజయనగరంలోని ఒక సాధువు (పేరు తెలియదు) ఈమెకు గురువు. ఆయన గొప్ప హఠయోగి. వారికి అనేక మహిమలు వుండేవిట! శిష్యురాలు మహిమల వెంటపడలేదు. భక్తి ప్రధాన రాజయోగాన్ని అనుసరించి తీవ్ర సాధన చేసి బ్రహ్మను భూతిని పొందారు. వీరిని అందరు "అమ్మాజీ" అని పిలిచేవారు. తారక మంత్రోపదేశం చేసి ఎందరో శిష్యులను అనుగ్రహించారు. ప్రతిఫలంగా వారి నుండి ఏమీ తీసుకొనేవారు కాదు. ఎవరు ఏమిచ్చినా అక్కడే అందరికీ పంచిపెట్టేవారు. తీసుకొనండని భక్తులు ప్రాధేయపడితే "తీసుకోవటం ప్రారంభిస్తే తిరిగి తిరిగి తీసుకోవాలనే ఆశ బయలుదేరుతుంది. ఆశకు అవకాశమే యివ్వరాదు" అనేవారు.

తరచు శిష్యులతో అమ్మాజీగారు "మేము (ఆమె, మాష్టారు) కఠిన సాధన చేసి బ్రహ్మవిద్యను సాధించాము. మీరంత కష్టపడవలసిన పనిలేదు. నిత్యజీవితాన్ని పరిశుద్ధంగా నడుపుకొంటూ, చేసే ప్రతిపనిని భగవదారాధనగా చేయండి. ఇట్లా చేస్తే మీలోనే వున్న భగవాన్ మీ బుద్ధిని ప్రబోధించి తనలో ఐక్యం చేసుకొంటాడు" అనేవారు.

జననం

పూజ్యులైన నరసమాంబ, అన్నయ్యశాస్త్రి దంపతులకు అయిదుగురు కుమారులు, ఒక కుమార్తె జన్మించారు. కొడుకుల్లో మాష్టారు ద్వితీయులు. 17-12-

19 10వ తేదీన కాశీలోజన్మించారు.జన్మ తిథి మార్గశిర బహుళ పాడ్యమి. నక్షత్రం ఆర్ద్ర.

మాస్టారు గర్భస్థులైనది మొదలు అమ్మాజీగారు అనారోగ్యం వల్ల ఒక్కనాడైనా అన్నం తినలేక పోయారు. రోజూపాలు, పండ్లు మాత్రమే స్వీకరించేవారు. పనిపాట్లు చేసుకొనే శక్తి లేక మంచం మీద పరుండి, తమ గురువుగారిచ్చిన లక్ష్యం పై మనసు నిలిపి, తదేక ధ్యాన స్మరణ జపాదులు చేసేవారు. ఒక మహాపురుషుడు తన గర్భంలో ప్రవేశించి వున్నట్లు అనేక నిదర్శనాలు, అనుభవాలు కలిగినట్లు అమ్మాజీగారే చెప్పారు. ఎప్పుడైనా మాస్టారి విషయం ప్రస్తావనకు వస్తే ఆ మాతృమూర్తి తన శిష్యురాండ్రతో "అన్నం వల్ల పెరిగినవాడు కాడమ్మా వీడు" అనేవారుట!

సాధనలు

మాస్టారికి ఆత్మవిద్య పై ఆసక్తి మెండు. బడికి వెళ్ళమని పంపితే ఎక్కడో ఒక ఖాళీస్థలంలో కూర్చుని ధ్యానమగ్నులయ్యేవారు. పార్వతీదేవి బాల్యాన్ని వర్ణిస్తూ మహాకవి కాళిదాసు "శరత్కాలంలో గంగానదిని హంసల్లా, నిశాసమయంలో మహౌషధిని స్వీయకాంతుల్లా విద్యార్థినీ దశలో పార్వతీదేవిని పూర్వజన్మవిద్యలు చేరుకొన్నాయి" అన్నాడు. మాస్టారికి ధ్యాన, ధారణ, సమాధి విద్యలు బాల్యంలోనే సిద్ధించాయి.

సృష్టిలోని అందమైన ప్రాణుల్లో త్రాచు పాము ఒకటి. దాని కాటు మరణానికి దారి తీయవచ్చు. కాబట్టి దాన్ని చూస్తే చాలమంది భయపడతారు. యోగులకు సర్పాలకు మధ్య ఏదో అవినాభావ సంబంధం వుంది. శివుడు యోగీశ్వరుడు. సర్పం అతని కంఠాభరణం. కాశీలో నిర్జనంగా వుండే లక్ష్మణేశ్వరస్వామి దేవాలయంలో మాస్టారు కొన్నాళ్ళు ధ్యానం చేసుకొనేవారు. అప్పుడొక పెద్ద సర్పం వచ్చి, శివలింగాన్ని చుట్టుకొని, పడగవిప్పి వారి కెదురుగా వుండేది. ఒకనాడు ఆ అద్భుత దృశ్యం వారి స్నేహితుల కంట పడింది. నాటి నుండి వారు అక్కడ ధ్యానించటం మానారు.

బాల్యంలోనే వీరికి భగవద్గీతతో పరిచయం కలిగింది. ఒకనాడు మాస్టారు మిఠాయి పొట్లంకొని గంగ ఒడ్డున తిన్న తర్వాత కాగితాన్నిదూరంగా విసరి వేసారు. అదిగాలికి ఎగిరి వచ్చి వీరి కాలిని తాకింది. దాన్ని తీసి తిరిగి దూరంగా విసిరారు. మళ్ళీ అది వీరి కాలినే తాకింది. ఇట్లా రెండు మూడుసార్లు జరగ్గా కుతూహలంతో దానిని తీసి చదివారు.అది భగవద్గీతలోని నాలుగో అధ్యాయంలో శ్రీకృష్ణుడు తన అవతార సిద్ధాంతాన్ని వివరించిన పుట. అందులోని శ్లోకాలు వారిని ఆకర్షించాయి. తరువాత అవే వారి జీవిత ధ్యేయమయ్యాయి.

బడికి సరిగా వెళ్ళటం లేదని తండ్రి మాస్టారిని కొన్నాళ్ళు అతి కఠినంగా శిక్షించారు. అయినా మార్పు రాలేదు. చివరకు వీరి పద్ధతి వేరని, మిగిలిన పిల్లలవంటి

రు కారని గ్రహించి మిన్నకున్నారు. చిన్నతనం నుండి తనకు తోచినట్లు డచుకోవటం వీరికి అలవాటు. వీరిలో పట్టుదల, తీవ్రత హెచ్చుగా వుండేవి.

కొంతకాలం హఠయోగాన్ని చాల తీవ్రంగా ఆచరించారు. ఆ సమయంలో చాల ఆహారాన్ని తీసుకొనేవారు. ఒక్కొక్కసారి ఆహారాన్ని విసర్జించి "టీ" తోను, నిమ్మకాయరసంతోను రెండు మూడు నెలలు ఉపవాసం చేసేవారు. అప్పుడు కూడ తమ పనులు చేస్తూనే వుండేవారు. అలసట, నీరసం వారిలో కనిపించేవి కావు. వీరు అనేక సాధనలను దిగ్విజయంగా పూర్తి చేసారు కాని ఒకే ఒక యోగక్రియ అసంపూర్ణంగా ముగిసింది. ఇది కాశీలో జరిగింది.

ఒక రోజున మాష్టారు తన తల్లి వద్ద ఎవ్వరూ లేకుండా చూసి "అమ్మా! ఇరవై నాలుగు గంటలు ఒక గోతిలో కూర్చుని తపస్సు చేస్తాను. ఆశీర్వదించి పంపు" అని అర్థించారు. అది చాల ప్రమాద భరితమైన సాధన అని ఆమెకు తెలును. వద్దన్నా మానడని గ్రహించి ఆశీర్వదించి పంపారు.

కొంతమంది మిత్రులనువెంట బెట్టుకొని మాష్టారు గంగానదికి సమీపంగా వున్న ఒక నిర్జన ప్రదేశానికి చేరుకొన్నారు. అక్కడ వారిచే ఒక గోతిని తవ్వించి అందులో కూర్చున్నారు. మిత్రులు గోతి పై బల్లలు పరిచి, మట్టికప్పి పూడ్చారు. ఇరవై నాలుగు గంటలయిన తర్వాతనే గోతిని తీయాలని, అంతవరకు తన తపస్సుకు విఘ్నం కలుగకుండా చూడాలని వారిని ఆదేశించారు.

ఆరోజు రాత్రికి మాష్టారు యింటికి రాకపోవటంతో వారి సోదరుల్లో ఆరాటం ఎక్కువయింది. తెల్లవారే సరికి అది పరాకాష్టకు చేరుకొంది. పూర్ణానందశర్మ గారు మాష్టారికి అన్న. తన తమ్ముడు ఎక్కడికి వెళ్ళిందీతెలిస్తే చెప్పమని యింటిల్లిపాదినీ వారు నిలదీసి అడగజొచ్చారు. అప్పుడు యింట్లో విజయలక్ష్మి అనే చిన్న అమ్మాయి వుంది. ఆమె అమ్మాజీగారి మేనగోడలు. శర్మగారి కంగారునుచూసి ఆమె "బావ గోతిలో కూర్చుంటానని అమ్మతో చెప్పి వెళ్ళాడు" అని చెప్పింది.

విషయం అందరికీ తెలిసిపోయింది. తన తమ్ముడు బ్రతికి వున్నాడా లేదా అనే ఆందోళనతో శర్మగారు బయలుదేరి గంగ ఒడ్డున తచ్చాడుతున్న మిత్రులను చూసారు. వారి పై మండిపడి గోతిని తీయించారు. వారు పై నుండి "చిన్నా!" అనిపిలవగా "ఆ" అని మాష్టారు గోతిలోంచి సమాధానమిచ్చారు. అప్పటికి రోజు పూర్తి కాలేదు. వారి శరీరం పీలంగా వున్నదట! "ఇరవై నాలుగు గంటలు పూర్తయి వుంటే బాగుండేది" అంటూ వారు బయటకు వచ్చారు.

ఏ సాధన చేసినా వారు దానిని పరీక్షించి నిగ్గు తేల్చుకొనాలని చేసారు కాని ఫలితాన్ని ఆశించలేదు. వారి యిష్ట దైవం శ్రీకృష్ణుడు. అభిమాన గ్రంథం భగవద్గీత.

తన సాధన పూర్తికానందుకు వారు విచారించలేదు. దానికి కారకులైన అన్నగార్ని పల్లెత్తు మాట అనలేదు. జయాపజయాలను సమభావంతో చూసిన స్థితప్రజ్ఞుడాయన.

వివాహం

జీవితంలో నాలుగు ఘటనలు నిశ్చయింపబడే వుంటాయన్నారు మాష్టారు. ఒకటి జననం. రెండు వివాహం. మూడు జీవిక సాధికకు అవసరమైన వృత్తి. నాలుగు మరణం. తనకు పెండ్లి చేయాలని తల్లిదండ్రులు ప్రయత్నిస్తున్నపుడు వారు కొంతకాలం ఆగమన్నారు. అయినా వారు వినలేదు. అపుడు విజయ నగరంలోని పాకల నరసింహశర్మ, సుచరిత్రాంబ దంపతుల తృతీయ కుమార్తె తనకు భార్య అవుతుందని చెప్పారుట! ఆ విధంగానే సంబంధం స్థిరపడి మైత్రాంబగారు వారికి భార్య అయ్యారు. ఈమె భర్త అడుగుజాడల్లో నడచిన యిల్లాలు. వీరికి పదిమంది దాకా సంతానం కలిగారు గాని చాల వరకు చిన్న వయసులోనే మరణించారు. నేటికి లలిత అనే కుమార్తె, గోపీనాథ్ అనే కుమారుడు జీవించి వున్నారు.

ఉద్యోగాలు

స్కూలు ఫైనల్ పరీక్షల్లో కృతార్థులైన తర్వాత మాష్టారు చాల ఉద్యోగాలు చేసారు. ఆధ్యాత్మిక సత్యాన్వేషణ, తీవ్రస్వభావం వీరిని దేనిలోను స్థిరపడనీయలేదు. యోగవిద్యలో వీరి గొప్పదనాన్ని గుర్తించి పండిత మదనమోహన మాలవ్యాగారు తమ విద్యాలయంలో యోగతరగతికి ఉపాధ్యాయునిగా నియమించారు. ఒకనాడు వీరు ధ్యానమగ్నులై కాలాన్ని మరచి మధ్యాహ్నం రెండు గంటలకు విద్యాలయానికి వెళ్ళారు. ఆఫీసులోనివారు "యిపుడు టైం ఎంతయింది ?" అనగా మాష్టారు "పదైంది" అన్నారు. అపుడు ఆఫీసులోని గడియారాలన్నీ అక్కడున్న వారికి పదిగంటల సమయాన్నే చూపాయి.

కొంతకాలం స్కూలు టీచరుగా పనిచేసారు. అప్పుడు వారికి హరిద్వారం దాటి హిమాలయాల్లోకి వెళ్ళే అవకాశం లభించింది. అక్కడ గుహల్లో తపస్సు చేస్తున్న యోగులను దర్శించి వారి ఆశీస్సులు పొందారు. మరికొంత కాలం బెంగుళూరులో హిందీ టీచరుగా పనిచేసారు. తర్వాత కాంగ్రెస్ పార్టీలో తిర్గిగారు. అప్పుడే వారికి గాంధీజీ, వినోబాభావేలతో పరిచయం కలిగింది.

తండ్రి మరణానంతరం వీరు కాశీ నుండి కాన్పూరు వచ్చారు. రైల్వేలో కొంతకాలం పనిచేసారు. తరువాత ఆర్డినెన్స్ ఫేక్టరీలో సూపర్‌వైజరుగా పని చేసారు.

గొళ్ళభండి వెంకట సత్యనారాయణ మూర్తిగారుఅదే ఫేక్టరీలో చార్జిమన్‌గా పనిచేసేవారు. రుదువ్వగ్రామస్తులు. వీరి ధర్మపత్ని రత్తమ్మగారు. ఉత్తర హిందూదేశంలో మాష్టారి జీవిత విశేషాలలో కొన్నింటిని మేము ఈమె నుండి సేకరించాము. మాష్టారు, మూర్తిగారు ఆప్తమిత్రులు.

ద్వితీయ ప్రపంచ యుద్ధం ముమ్మరంగా జరిగే రోజులవి. ఒకనాడు మాష్టారికి, ఆంగ్లేయ అధికారికి నడుమ ఫేక్టరీలో ఘర్షణ వచ్చి మాటామాటా పెరిగింది. ఆంగ్లేయుడు కోపంతో "దుష్టులైన భారతీయులు మీరు (You bloody Indians)" అని మాట మీరాడు. "నా జాతిని అవమానించే అధికారం నీకెక్కడిది?" అని మాష్టారు వాని చెంపపై కొట్టారు. ఫలితంగా వారి ఉద్యోగం వూడింది.

కొంతకాలం కార్ల కంపెనీలో పనిచేసారు. దానిలో ఉద్యోగుల సంఖ్యను తగ్గించ వలసిన పరిస్థితి వచ్చింది. తన జూనియర్ అర్థించగా, అతని ఉద్యోగాన్ని నిలపటానికి మాష్టారు రాజీనామా సమర్పించారు.

తత్వదర్శి

మాష్టారి తమ్ముడు అనంతరామశర్మగారికి రాధాకృష్ణులపై అపరిమితమైన భక్తి. ఒకనాడది పరాకాష్టకు చేరుకోగా భక్తి పరవశులై వరుసగా మూడు రోజులు రాధాకృష్ణ సంకీర్తనం వినా యితరత్రా పనులు వేటినీ చేయటం మానారు. మహావైరాగ్యంలో మునిగి సంసారాన్ని విడిచి సన్యాసాశ్రమాన్ని స్వీకరించాలని నిశ్చయించు కొన్నారు. తమ సంకల్పాన్ని మాష్టారికి తెలిపి వారి అనుమతిని వేడారు. అర్జునులకు శ్రీకృష్ణుల వారిలా మాష్టారు కర్మక్షేత్రంలో నిర్వాణాన్ని చూపి వారి మోహాన్ని తొలగించారు.

ఒక్క అనంతం గారినే కాదు. వారిలా భావించిన అనేకుల మోహాన్ని తొలగించిన తత్వదర్శి ఆయన. జ్ఞానాన్ని తత్వదర్శకుల వద్ద వినమ్రులమై నేర్చుకోవాలంటోంది గీత.

మలుపు

నదుల్లాగే జీవితాలు కూడా మలుపులు తిరుగుతాయి. మహనీయుల జీవితాల్లోని మలుపులు లోకకల్యాణార్థం సంభవిస్తాయి. అతీంద్రియ జ్ఞానము, శక్తి–రెండూ కలిసిన అర్ధనారీశ్వరునిలా మాష్టారు ఉత్తరహిందూ దేశంలో సంచరించారు. సామాన్యులు జ్ఞానానికిగాక మహిమలకే ఆకర్షితులవుతారు. వారి ఆశీర్వాదం వల్ల సంతులేనివారికి సంతు కలిగింది. రోగగ్రస్తులు ఆరోగ్యవంతులయ్యారు. కష్టాల

కడలిలో మునిగినవారు గట్టెక్కారు. అంతేకాదు. కాన్పూరులో ఒకనాడు సత్యనారాయణమూర్తి గారు దూరం నుండి వస్తున్న రైలును చూసి "దానిని మీరు ఆపగలరా?" అని సవాలు విసిరితే – మాష్టారు "సరే" అన్నారు. వస్తూవస్తూ వున్న రైలు మార్గమధ్యంలో ఆగిపోయింది. తాగే తాగే గ్లాసును అకస్మాత్తుగా క్రిందపెట్టి, సైకిలు పై వెళ్ళి, బస్సును దానితో ఢీకొట్టి దాని క్రిందపడి మరణించబోయే బాలికను రక్షించారు. ఇటువంటి అద్భుత సంఘటనలు అనేకం జరిగాయి. వీరి మహిమలను చూసినవారు వీరిని "భగవాన్" అని పిలవసాగారు.

తాను భగవంతుడని మాష్టారు ఎన్నడు చెప్పుకోలేదు. మానవుడు దేవుడు కాదు. "నేనే దేవుణ్ణి" అనుకొనేవాడు ఆవిధంగా తననుతాను భావించుకొని ఆనందించవచ్చు. అది ఆవ్యక్తికే పరిమితం. వ్యక్తి సృష్టిలో ఒక అంశేకాని సృష్టికాదు. ఒకవ్యక్తి మరణించినంత మాత్రాన ఈ సృష్టి ఆగిపోదు. యోగుల్లోని మహిమలు దైవశక్తికి నిదర్శనాలు మాత్రమే! వాటివల్ల ఏయోగి దేవుడుకాడు. సమస్త జీవరాసుల్లో నిగూఢంగా వున్న పరమేశ్వరుడొక్కడే సృష్టిస్థితిలయాది క్రియలకు అధిపతి.

అవి మాష్టారు కాన్పూరులో భగవాన్ అని పిలవబడే రోజులు. ఒక సామాన్య గృహిణి జ్వరతీవ్రతతో మంచం పై పడివుంది. అయిదారేండ్ల ఆమె కుమార్తె మాష్టారిని దర్శించి, వారిచ్చే కుంకుమను తెద్దామని వచ్చింది. ఆ సమయంలో చాలమంది పెద్దలు వారిని పరివేష్టించి వున్నారు. వారిని సమీపించటానికి ఆమెకు చాల సమయం పట్టింది. క్రోధంతో ఆమె "నిన్ను కలుసుకోవటానికి యింతకాలం పడుతుందా!" అంటూ వారి చెంపపై కొట్టింది.

అవటానికిది చాల చిన్న సంఘటనే కావచ్చుగాని ఆమెలో తాను దేవిని చూసానని, దైవవాణిని విన్నానని మాష్టారు ఒకనాడు మాతో అన్నారు. దీని తర్వాత వారు తమ సమస్త సిద్ధులను గంగార్పణం చేసారు. కుటుంబంతో సహా కాన్పూరును విడిచి విజయనగరంలోని అత్తవారింటికి చేరుకొన్నారు. తిరిగి వీరెన్నడు తమ శేష జీవితంలో మహిమలు చూపలేదు. సర్వసామాన్య వ్యక్తిగా జీవితం గడిపారు. వారి జీవితంలోని ఈ మలుపుకు పై సంఘటన కారణమని మావ్యక్తి గత అభిప్రాయం. ఇది నిజం కావచ్చు. కాకనూ పోవచ్చు. ఎందుకంటే ఈమలుపుకు గల కారణాన్ని వారు చెప్పలేదు.

అనారోగ్యం

"రోగంతో తపించటం గొప్పతపస్సు. దీనిని తెలిసినవాడు ఉత్తమలోకాన్ని

యిస్తాడు" అంది బృహదారణ్యకోపనిషత్తు (5-11-1).

నలభై సంవత్సరాలకు పైబడి రోగం అంటే ఏమిటో ఎరగని మాష్టారు ంధ్రప్రాంతానికి వచ్చిన తర్వాత తీవ్రమైన ఆస్త్మావ్యాధికి లోనయ్యారు. ఆవ్యాధిపీడను వారు తపస్సుగానే భావించారు.

విజయనగరంలో మాష్టారు సామాన్యవ్యక్తి. భగవాన్ అని పిలుస్తూ ంటపడేవారు లేరిక్కడ. కుటుంబ పోషణార్ధం కొంతకాలం ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. మరికొంతకాలం బస్సుకండక్టరుగా వున్నారు. తరువాత గనుల్లో పని చేసారు. ఈ సమయంలోనే వారి ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. కుటుంబం డవటం కష్టమైంది.

కష్టాలు రావటం ప్రారంభిస్తే ఒకదాని వెంట ఒకటి తరుముకొంటూ వస్తాయి. మాష్టారి భార్య మైత్రాంబగారి ఆరోగ్యం పాడయింది. ఆమె గర్భవతి. వంటికి నీరు పట్టింది. కాన్పూరు నుండి వచ్చేటప్పుడు ఆమె తన వెంట కొంత డబ్బు తెచ్చారు. తనకొక యిల్లుకొనమని దానిని తల్లికిచ్చారు. ఆమె దానిని ఖర్చు చేసింది. డబ్బులేదు. యిల్లులేదు. పిల్లలా చిన్నవాళ్ళు. భర్త అనారోగ్యంతో వున్నారు. ఒకవైపున నిత్యదరిద్రం, రెండోవైపున అనారోగ్యం పట్టి పీడిస్తుండగా ఒకనాటి రాత్రి ఆయిల్లాలు మాష్టారితో "మనమిద్దరం రోగిష్టులమయ్యాం. నేను ఎటూ బ్రతకను. మీరయినా ఎక్కడికైనా వెళ్ళి ఆరోగ్యం బాగుచేసుకోండి. యిక్కడే వుంటే మీరు కూడ బ్రతకరు. పిల్లల కోసమైనా మీరు బ్రతకాలి" అన్నారు.

మాష్టారు బయలుదేరి తాడేపల్లిగూడెంలోని తన తమ్ముని బావమరిది ఈమని వెంకటేశ్వర్లుగారి యింటికి వచ్చారు. జ్వరం, ఆయాసం, దగ్గు ఎక్కువై రెండు నెలలు అక్కడే వున్నారు. ఆ సమయంలోనే మైత్రాంబగారు స్వర్గస్థులయ్యారు. అనారోగ్యంతోనే బయలుదేరి విజయనగరం వెళ్ళారు. తాను ఎక్కడయినా స్థిరపడిన తర్వాత పిల్లలను తీసుకొని వెడతానని అత్తగారికి చెప్పి అంబర్‌నాధ్ వెళ్ళారు. అక్కడ అమ్మాజీగారు, తమ్ముడు వాగేశ్వరరావు వారిని ఆసుపత్రిలో చేర్చి వైద్యం చేయించారు. రెండు నెలలు వారు ఆసుపత్రిలోనే వున్నారు. అప్పుడు తనకు జరిగిన వైద్యాన్ని గూర్చి చెబుతూ వారు "ఈశరీరంలో సూదిదిగని చోటులేదు" న్నారు. ఈ సమయంలోనే వారి మరదలు విజయలక్ష్మి వైద్య ఖర్చుల కోసం తనవంటి మీద నగలను అమ్మింది. మాష్టారు డిశ్చార్జి అయిన తర్వాత వారి కుమార్తె లలితకు వివాహం నిశ్చయమైనట్లు అత్తగారి నుండి జాబువచ్చింది. వారు విజయనగరం వెళ్ళారు కాని పెండ్లి చెడిపోయింది.

అనారోగ్యం వల్ల తాను శారీరిక శ్రమ చేయలేననిగుర్తించి వారు ఆశ్రమ

జీవితాన్ని గడపాలని నిశ్చయించు కొన్నారు. దువ్వలో తనకోసం ఒకపాక వేయవ తన అభిమాని రాళ్ళభండి వెంకటరామ జోగయ్యగారికి చెప్పారు.వారు వాగ్దా చేసారుకాని దాన్ని నెరవేర్చకుండానే స్వర్గస్థులయ్యారు. శ్రీ మల్లోజు భూషణాచార్యు తన స్నేహితుని వాగ్దానాన్ని నెరవేర్చి దువ్వకు రావలసినదిగా కోరుతు మాష్టా జాబువ్రాసారు.

ఉత్తర హిందూదేశంలో నివసించే రోజుల్లోనే తన జీవిత చరమాంకా దువ్వలో గడుపుతానని చెప్పినట్లు వారి బంధువులు చెప్పారు. జీవితంలో కొ ఘట్టాలు నిర్ణయించబడే వుంటాయి. ఎక్కడకాశీ! ఎక్కడదువ్వ! చివరకు వా దువ్వ రావటానికే పరిస్థితులు దారి తీసాయి.

అవ్యయాశ్రమం

పశ్చిమ గోదావరిజిల్లా తణుకు మండలంలోని గ్రామం దువ్వ. పూర్వ దూర్వాస మహర్షియిక్కడ తపస్సు చేసాడని స్థలపురాణం వుంది. గ్రామానికి పడమ వైపున ఎర్రకాల్వ ప్రవహిస్తోంది. గ్రామస్థులు దీన్ని "షెయ్యేరు" అని అంటా ఏటికి తూర్పున గ్రామం విస్తరించింది. ఆరోజుల్లో పడమటి వైపున పాలాలేగ యిళ్ళులేవు. పడమటి ఏటిగట్టుకు దిగువున వున్న పోరంబోకులో ఒకతాటా పాకవేసారు. నట్టనడుమ నాటిన నిట్రాడు నుండి క్రిందికి వాసాలు దింపారు. గర్భ వసారా – రెండూ చతురస్రాకారంలో వున్నాయి. గర్భానికి నాలుగు, వసారా నాలుగు – వెరసి ఎనిమిది ద్వారాలు పెట్టిదడులతో గోడలు పెట్టారు. ద్వారాల గుమ్మాలు, తలుపులు లేవు. నాలుగు వైపులా ద్వారాలుండటం వల్ల ఏవైపు నుండయి – మనుష్యులుగాని, జంతువులుగాని స్వేఛ్ఛగా లోనికి రావచ్చు. గర్భం చుట ప్రదక్షిణం చేయవచ్చు. ఈపాకలోనికి క్రీ.శ. 1953వ సంలో ఆమహాయో అనారోగ్యంతో బాధపడుతూ ఒంటరిగా ప్రవేశించారు. గ్రామస్థులకు వారు అపరిచితుల పైగా ఊరికి దూరంగా వుంటున్నారు. వారికి తెలిసిన కుటుంబాలు దువ్వలోన దాని చుట్టుపట్ల రెండు మూడు మాత్రమే! వారు ఎవ్వరినీ దేహి అని యాచించర ఎవరయినా తన వద్దకు రావాలిగాని తనకొరకై తాను ఎవరియింటికివెళ్ళరు. ఇ విధంగా ఆయన అగ్నిగుండంలోనే అడుగు పెట్టారు. అయితే వారి అరచేతి నీరుంది. అదే వారి ఆత్మశక్తి.

వారు సన్యాసాశ్రమాన్ని స్వీకరించలేదు. గీతాచార్యున్నిలా కర్మక్షేత్రాని ప్రాముఖ్యత నిచ్చారు. "ఆరోగ్యం అనుకూలించటం లేదుగాని లేకుంటే పంచాయి వీధి దీపాలు వెలిగించే పని చేసి వుండే వాడి "నని ఒకసారి అన్నారు సర్వసంగపరిత్యాగంతో స్థితప్రజ్ఞునిలా సంసారంలో సంచరించటం వారి ఆదర్శ

ఆశ్రమంలో ప్రవేశించటానికి ముందు తన అభిమానులతో "ఎవరికి తోచింది వారివ్వండి. ఆశ్రమజీవితాన్ని గడుపుతా" నని అన్నారుట! అయితే వారిని తన పోషణకు బాధ్యులుగా చేయలేదు. తన భారాన్ని భగవానుని పై విడిచారు. దైవం సాయంచేస్తే దాన్ని మానవులచే చేయిస్తాడు గాని తనంతట తానుగాదిగి వచ్చి చేయడు.

వారి అతీంద్రియ శక్తులకు ఆకర్షితులై జనం వస్తారని, తద్వారా ధనకీర్తులు లభిస్తాయనే భావన ఆశ్రమాన్ని దేవాలయం నమూనాలో నిర్మించటం వెనుక వుంది. తనను స్వప్రయోజనానికి వినియోగించుకొనే అవకాశం ఆయన ఎవ్వరికి యియ్యలేదు. అది జిజ్ఞాసువులకు ఆశ్రమంఅని, తన పిల్లలకు తలదాచుకొనే యిల్లని అన్నారు.

ఆశ్రమంలో చేరిన కొన్ని రోజులకే వారికి తిరిగి తీవ్రంగా నుస్తీ చేసింది. ఏటిగట్టు పై వెళ్ళే వారికి ఆశ్రమంలో నుండి మాష్టారి మూలుగులు వినిపించసాగాయి. ఒకనాటి రాత్రి ఉబ్బసం మరింత ఉద్భతమైంది. ఇనుకపల్లి రామరాజుగారు అప్పుడు తమ పొలంలోని పాకలో పడుకొన్నారు. ఆశ్రమంలో నుండి మాష్టారి మూలుగులు వారికి వినిపించసాగాయి. మనసు వుండబట్టలేక వారు ఆశ్రమంలోనికి వచ్చారు. కిరసనాయిలుదీపం పైనుండి వ్రేలాడుతోంది. మాష్టారు మంచం పై కూర్చుని బిగ్గరగా మూలుగుతున్నారు. "ఈరాత్రి మీకు ఆయాసం చాల ఎక్కువగా వుంది. నన్ను సాయం వుండమంటారా?" అన్నారు రాజుగారు. దానికి వారు అంతవగర్పులో కూడ "వద్దు. మీరు భయపడతారు. ఈరాత్రి నేను చనిపోతే నాశవాన్ని దహనం చేయటానికి ఎవ్వరినీ పిలవకండి. ఈపాకకు నిప్పుపెట్టండి. దీనితో పాటే ఈశరీరం కూడ భస్మమైపోతుంది" అన్నారు.

ఆ దృశ్యాన్ని చూసి రాజుగారు భయపడ్డారు. తమపాకలోకి వెళ్ళిపడుకొన్నారు. మెలకువ వచ్చినప్పుడల్లా ఆశ్రమంలోంచి వస్తున్న మూలుగులు వింటూనే వున్నారు. ఆరాత్రి మాష్టారు బ్రతకడనే అనుకున్నారాయన. కాని తెల్లవారిన తర్వాత ఉబ్బసం ఉపశమించింది. ఆత్మ జయించింది. రాజుగారు తమ యింటి నుండి నూకల జావతెచ్చి వారిచే త్రాగించారు.

రాళ్ళభండి రత్తమ్మగారు తణుకు నుండి తరచు ఆశ్రమానికి వచ్చి కావలసిన వస్తువులు అమర్చి వెళ్ళేవారు. మునుకుట్ల శారదాంబగారు వీరికి ఆహారాన్నిపంపేవారు. వారి పరిచయాన్ని పొందిన స్త్రీ పురుషులెందరో వారి అభిమానులయ్యారు. వారిలో ధనికులున్నారు. పేదలున్నారు. అందరినీ వారు సమభావంతో చూసారు. స్థలాభావం వల్ల వారి పేర్లను యిక్కడ పేర్కొన లేక పోతున్నాము. మాకు 1954 వ సంవత్సరములో వారితో పరిచయం కలిగింది. అది నేటికీ మాజీవితాల్లో సువాసనలు వెదజల్లుతోంది.

తేలుగాని, జెఱ్ఱిగాని కుట్టి బాధతో ఆశ్రమానికి వచ్చిన గ్రామస్థులకు వారు అక్కడి మట్టిని యిచ్చి "వెను తిరిగి చూడ కుండా యింటికి వెళ్ళి దీనిని కుట్టిన చోట వేయండి" అనేవారు. బాధ ఉపశమించేది.

"తిండ లేక అలమటించే వారికి వేదాంతమెందుకు? మొట్టమొదట అందరికి తినటానికి తిండి, కట్టుకోటానికి బట్ట, వుండటానికి యిల్లు వుండాలి. అప్పుడే ప్రశాంతంగా భగవద్విచారణ చేయాలి" అన్నారు.

"ఈర్ష్యా ద్వేషాలను దరిజేరనీయవద్దు. దైవికమైన కష్టాలకంటె వీటివల్ల మానవుడు మానవునకి పెట్టే కష్టాలు ఎక్కువ" అనేవారు.

బుద్ధిని స్వచ్ఛంగా వుంచుకోమని, సమదృష్టిని అలవరచుకోమని చెప్పేవారు.

"మంచిచెడులు, పాపపుణ్యాలనే ద్వంద్వాలు మనం సృజించుకొన్నవే గాని కర్మలకు లేవు. అందుకే ఒకేకర్మ కొందరికి మంచిగాను, మరికొందరికి చెడుగాను కనిపిస్తోంది. కర్మవాటికి అతీతంగా వుంది." అన్నారు.

"కర్మజడం. దానికి తెలివి (consciousness) లేదు. అది మానవుని బంధించదు. కర్మలో గల ఆసక్తి మానవుని బంధిస్తుంది. కాబట్టి సమబుద్ధితో కర్మ చేయాలి" అనేవారు.

"ఏవిధంగా రాత్రింబవళ్ళు రోజులో అంతర్భాగాలో - అదే విధంగా కష్టసుఖాలు, శీతోష్ణాది ద్వంద్వాలు జీవితంలో అంతర్భాగాలు. మనం రోజును చూడాలి. మాసాది కాలగణనానికి రోజు ప్రమాణం" అన్నారు.

"ఎవరికి సాయం చేసినా దానిని ఆవలవ్యక్తి ఏవిధంగా ఉపయోగించు కొన్నాడన్నది సాయం చేసే వ్యక్తి అధీనంలో లేదు. ఈ దృష్టితోనే సాయం చేయండి. ఎవరికి ఋణం యిచ్చినా అది తిరిగి రాకుంటే ఎంతవరకు మీ జీవితం దెబ్బతినదో - అంత వరకే యివ్వండి" అన్నారు.

"మీరు ఏపని చేసినా అది మీకేగాక యితరులకు కూడ చెందుతుంది. రైలుబండిని నడిపేవాడు ఆపనిని తనస్వార్థం కోసమే చేస్తున్నా దానివల్ల ఎందరో ప్రయాణీకులు తమతమ గమ్యాలకు చేరుకుంటున్నారు. కాబట్టి మీరు చేసే ప్రతిపనిని త్రికరణ శుద్ధిగా చేయండి. అయిష్టంతో చేయవద్దు" అన్నారు.

"తానుతప్పయితరం ఏదీ లేనప్పుడు తానువున్నానని ఎవ్వడు తెలుసుకోలేడు. గాఢనిద్రలో వున్నవాడు తానున్నాని ఎరగడు కదా! "నేను" అనేది యితరం వుంటేనే వున్నది. ఏకాకి ఆనందించలేడు. స్వసుఖం పరులపై ఆధారపడి

వుంది. మానవుడు తన స్వార్థాన్ని కుటుంబహితం కోసం,కుటుంబ హితాన్ని గ్రామ హితం కోసం, గ్రామ హితాన్ని దేశహితం కోసం, దేశహితాన్ని విశ్వహితంకోసం విడిచిపెట్టాలి” అన్నారు.

మాష్టారి పిల్లలు ఆశ్రమానికి వచ్చి తండ్రి వద్ద స్థిరపడ్డారు. మైత్రాంబగారి కోరిక నెరవేరింది. సామాన్య జీవితావసరాలను మించి ఆశ్రమంలోనికి వస్తువులు ఎన్నడు చేరలేదు. సమయానికి అవసరమైన దానిని ఎవరో ఒకరు తీసుకొని వచ్చేవారు. ఎవరు వారికి సాయం చేసినా తద్వారా వారు శుభాలను రుచి చూసారు.

1955 సం॥రంలో ఎర్రకాల్వకు వరదలు వచ్చి ఆశ్రమం దెబ్బతిన్నది. వేరే గ్రామంలో వారికి ఆశ్రమాన్ని నిర్మించటానికి కొందరు అభిమానులు ముందుకు వచ్చారుగాని వారు అంగీకరించ లేదు. “నే నీగడ్డ పై గొప్పతపస్సు చేసి ధార పోసాను. ఇక్కడ ఒక కుటుంబ బ్రతికి తీరుతుంది. నేను యిక్కడే వుంటాను. ఈక్షేత్రాన్ని దర్శించిన వారి కష్టాలు తీరతాయి. కోరికలు నెరవేరతాయి. దీనినే వృద్ధి చేయండి ” అన్నారు.

ఆయన గొప్ప మనస్తత్వవేత్త. సిద్ధ పురుషుడు. కీర్తి ప్రతిష్ఠలను, ధనసంపదలను ఆర్జించ సమర్థులేగాని సమస్త సిద్ధులకు అధినాథుడై, కుబేరాది ధనికులకు ఆరాధనీయుడై కూడ ఆత్మనిష్ఠుడైన పరమశివునిలా వారు శూన్యంలో నుండి సాగే జీవితాన్నే ఎన్నుకొన్నారు. పరహితంలో నిజహితాన్ని చూసారు.

యోగులలో రెండు వర్గాలను పేర్కొని వారి మధ్యగల వ్యత్యాసాన్ని చూపింది గీత (6–3). యోగాన్ని అధిరోహించటానికి ప్రత్నించేవారు మొదటి తరగతి. వీరి సాధనకు కర్మ లేక ప్రకృతి కారణం. యోగారూఢులు రెండో తరగతి. వీరి సాధనకు శమము లేక ఆత్మ కారణం. మొదటి వారిది ఆరోహణక్రమం. రెండో వారిది అవరోహణ క్రమం. తాను రెండో తరగతికి చెందుతానని అన్నారు మాష్టారు.

స్థితప్రజ్ఞుడు

మాష్టారిని గంగానది అనుకొంటే – ఉత్తర హిందూదేశంలోని వారి జీవితం హిమాలయాల్లోని ప్రవాహంతోను, ఆశ్రమ జీవితం మైదానంలోని ప్రవాహంతోను సరిపోలుతుంది. మొదటి దానిలో తీవ్రత, రెండోదానిలో ప్రశాంతత అధికం. జన్మస్థానం నుండి సాగర సంగమం వరకు ప్రతిఫలాన్ని కోరని సమానత్వమే గోచరిస్తుంది.

ఆశ్రమం కట్టిన కొత్తలో పాములు పారాడేవి. ఎవ్వరు పాముకాటుకు లోను కాలేదు. జనం రావటం ప్రారంభించిన తర్వాత అవి కనుమరుగయ్యాయి. కుక్కలు,

పిల్లలు తమ శత్రుత్వాలను మరచి వారి వద్ద సంచరించేవి. ఆశ్రమంలో కూర్చుంటే ఏదో అనిర్వచనీయమైన శాంతి ఆవరించేది. మానసిక బాధలు సద్దుమణిగేవి.

వారి శరీరం వ్యాధిగ్రస్తమైనా దృఢంగా వుండేది. కళ్ళుకాంతి వంతంగా వుండేవి. తెల్లని చొక్కా, లుంగీ ధరించేవారు. మంగలి రాక పోవటం వల్ల గెడ్డాన్ని పెంచారు. ఆస్మాకు మంచిదని లంకాకు చుట్టలు కాల్చేవారు. చుట్టను పెద్దదిగా చుట్టేవారు. ఒకనాడు పడక కుర్చీలో కూర్చుని చుట్ట వెలిగించి ఆలోచనల్లో లీనమైపోగా వారి చేతివేళ్ళు కాలి పుండ్లు పడ్డాయి. తన జీవితాన్నంతా వారు భగవదారాధనగా మలచు కొన్నారు. ప్రత్యేకంగా దేవుని ప్రార్థించటం, పూజించటం చేసేవారు కాదు. జిజ్ఞాసులు అక్కడ ప్రార్థన, ధ్యానం చేస్తామంటే వారిని ప్రోత్సహించే వారు. తాను చెప్పిన దానిని సాధనకు చేర్చుకొనండనే వారు.

ఆశ్రమం చుట్టూ వారు మొక్కలు వేయించారు. పశువులు వస్తే ఆయ వంతోనే వాటిని బయటకు తోలేవారు. కొంతమందికిది ఆగ్రహాన్ని కలిగించింది వారంతా కలిసి ఒకనాడు పశువులను లోనికి తోలి మొక్కలను వాటిచే తినిపించారు మరునాడు మాష్టారు తిరిగి మొక్కలు పెట్టారు. ఆశ్రమం ఆక్రమణ కావున తీసివేయమ నోటీసు వచ్చింది. పై అధికారులను సమీపించి వారు "స్టే" తెచ్చుకొన్నారు. తాన చేసే పనులకు ఆటంకాలు వస్తే వాటిని శాంతభావంతో ఎదుర్కొన్నారేగాని విడి పెట్టలేదు.

మాష్టారు తమ మహిమలను గంగార్పణం చేసిన సంగతిని స్మరించి ఒకనాడ రామరాజుగారు "ఒక్క మహిమనైనా మాకు చూపండి" అని కోరారు. దానికి వా "మీరు యింటికి వెళ్ళి భోజనం చేసి రండి. తిన్నదానిని నాముందు వాంతిచేసుకొండి తరువాత కక్కిన దాన్ని తినండి. మీరు కోరినట్లు చేస్తాను" అన్నారు.

విభిన్న మనస్తత్వాలున్న వ్యక్తులు ఆశ్రమానికి వచ్చారు. వారిల పండితులున్నారు. పామరులున్నారు. ప్రతి ఒక్కరికి మాష్టారు వారికంటె ఒక మెట్ట ఎత్తులో వున్నట్లు కనిపించేవారు. పశులకాపరులతో వారు 'పులి-మేక' ఆడారు పేద పిల్లలతో పరాచకా లాడారు. పండితులకు పండితునిగా, తాత్వికులక తత్వదర్శిగా, రాజకీయవేత్తలకు రాజనీతిజ్ఞునిగా గోచరించారు. ఎవరి స్వధర్మాలన మార్చటానికి వారు ప్రయత్నించలేదు. ఉషఃకాలంలోని మంచు విభిన్న పుష్పజాతులన వికసింపజేసినట్లు వారివారి స్వరూప స్వభావాల వికాసానికి తోడ్పడ్డారు.

భగవద్గీత వినా వీరికి గురువంటూ ఎవరు లేరు. సంవత్సరానికి ఒ అధ్యాయం చొప్పున దానిని తమ జీవితంలో ఆచరించి, ఆపోసన పట్టారు స్థితప్రజ్ఞుడెల్లావుంటాడని గీత వర్ణించిందో – అవే లక్షణాలతో వారు మా ఎదు

జీవించారు. గతించిన తమ జీవిత విశేషాలను చెప్పటానికి వారు ఉత్సుకతను చూపలేదు. ప్రత్యక్షంగా వున్న వారి నడవడి నుండి స్ఫూర్తిని పొందమన్నారు.

ఒకనాడు యిద్దరు సాధువులు ఆశ్రమానికి వచ్చారు. మాటల్లో స్థితప్రజ్ఞస్థితి ప్రస్తావనకు రాగా వారితో మాస్టారు "అది మానవుడు చచ్చి తిరిగి బ్రతకటం వంటి" దన్నారు. సాధువుల్లో ఒకరు కేవలం వాక్యార్థాన్నే ప్రధానంగా తీసుకొని 'చచ్చిన తర్వాత తిరిగి బ్రతకటం అసాధ్యం. పరీక్ష కిది నిలిచేది కా" దంటూ ఎదురువచ్చారు. "అయితే భయపడకుండా నన్ను చూడం" డని మాస్టారు మంచంపై వెల్లకిలా పడుకొని కళ్ళు మూసుకొన్నారు. కొంతకాలం గడిచే సరికి వారి శరీరంలో నాడి, శ్వాస ఆడటం ఆగాయి. శరీరం రంగు మారసాగింది. అక్కడే వున్న ఇనుకపల్లి రామరాజుగారు, సాధువులు వారి శరీరాన్ని పరీక్షించి ఆయన మరణించారని చాల కంగారు పడ్డారు. మరి కొంతకాలం గడిచాక వారి శరీరంలో కదలిక వచ్చింది. నాడి, శ్వాస తిరిగి ఆడసాగాయి. మాస్టారు కళ్ళు తెరిచి "చచ్చి బ్రతకటం అంటే ఏమిట్లో మీకిప్పుడు తెలిసిందా!" అన్నారు.

త్రివేణీ సంగమంలోని సరస్వతీ నదిలా వారిలో ఆత్మజ్ఞానం అంతర్వాహినిగా వుండేది. అప్పుడప్పుడు రాత్రి సమయంలోనే వారిని దర్శించుకొనేందుకు వీలు చిక్కేది మాకు. ఆ ప్రశాంత నిశీధిలో వారు చెప్పే ఆధ్యాత్మిక విషయాల్లో ఆత్మజ్ఞానం మెరుపులా మెరిసేది. ఆ సమయంలో ఆ యాసం వారినుండి దూరంగా తొలిగేది. ఉన్నత స్తరాల నుండి వారి మాటలు ఉచ్చరితాలయ్యేవి. వాటిలో విప్లవాత్మక భావాలు తొంగి చూసేవి. వారిలో చూపుకు విస్మితులమై మేము కాలాన్ని మరిచే వాళ్ళం. "మీకు మాత్రమే వీటిని చెప్పటం లేదు. జిజ్ఞాసువుల అంతరంగాల్లోనికి ఈ భావాలు చేరుకొంటాయి" అనేవారు. చెప్పటం ముగించగానే ఆయాసం తిరిగి వారిని ఆవహించుకొనేది. తన భావాలు చాప క్రింద నీరులా పాకాలి అనేవారు.

విప్లవాత్మక భావాలు

ప్రస్తుత ప్రచలిత భగవద్గీత రైలు బండిని పోలి వుంది. అర్జునుల మోహాన్ని తొలగించి వారిని కర్తవ్యోన్ముఖులను జేసిన శ్రీకృష్ణుల వారి ఉపదేశం మూడో అధ్యాయంతో ముగిసింది. ఇది వ్యాస విరచితమైన మూలగీత. దీనిపై వైశంపాయనాది మహనీయులు రచించిన టీకలే మిగిలిన అధ్యాయాలు. శక్తివంతమైన మూలగీత అనే ఇంజను అధ్యాయాలనే బోగీలను తనతోపాటు లాగుకొని పోతోంది.

మూడో అధ్యాయంవరకు గల శ్రీకృష్ణోపదేశాన్ని నాలుగో అధ్యాయం అవ్యయ యోగమని పేర్కొంది. ఇది పరమేశ్వరుని యోగం. పూర్వం రాజర్షి

లాచరించిన ఈ యోగం కాలగతిచే లోపించగా శ్రీకృష్ణులు దీని అర్జునులకుపదేశించి పునరుద్ధరించారని వివరించింది. కాంతి కిరణంలోని రంగుల్లా దీనిలో మోక్షమార్గాలన్నీ అంతర్లీనమై వున్నాయి.

సమాధిస్థితిని పొందటంతో సాధన అంతం కాదు. ఏ విధంగా వైద్యవిద్యలో పొందిన కృతార్థత వైద్యం చేయటానికి అర్హతఅవుతుందో – అదే విధంగా ఆత్మానుభూతి గీతాయోగ సాధనకు అర్హత మాత్రమే! అక్కడ నుండే గీతలో అవ్యయయోగ సాధన ఆరంభమవుతుంది.

"ఆత్మ తాను అనేకం కావాలని సంకల్పించింది. తపస్సుచే ఈ లోకాన్ని సృజించి, దీనిలోనే ప్రవేశించింది. సత్యమైన ఆత్మే సత్యాసత్యాలు, వ్యక్తావ్యక్తాలు మొదలైన ద్వంద్వాలయింది" అంది తైత్తరీయం. యోగం అంటే కలయిక. ఆత్మ తాను సృజించిన ప్రకృతిలో ప్రవేశించటం యోగం. ఆత్మ అవ్యయం(నాశనం లేనిది) కాబట్టి దాని యోగం కూడ అవ్యయమే! దాని యోగైశ్వర్యమే ఈ మహావిశ్వం.

సృష్టి పాపంగాని నీచంగాని కాదు. పరమేశ్వరుడే సృష్టిచక్ర ప్రవర్తకుడు అందుకే గీత ఆత్మను ఆధారంగా జేసుకొని ఇహానికి ప్రాముఖ్యాన్నిచ్చింది. ఇహంలో జీవితం, జ్ఞానం, అనుభవం, పురుషార్థం వున్నాయి. ఇది కర్మక్షేత్రం. ఆత్మ తనను తాను అవ్యయ రూపాల్లో వ్యక్తపరచుకొంటున్న పవిత్ర పుణ్యస్థలి. ఇక్కడ బంధం స్వాతంత్ర్యానికి, మరణం అమృతత్వానికి, అంతం అనంతానికి ప్రేరణ. ఏ బ్రాహ్మీస్థితి గీత స్థితప్రజ్ఞని ముందు ఆదర్శంగా నెలకొల్పిందో – అది జీవితంలో అనుభవనీయమంది.

అవ్యయయోగం పక్షిలాంటిది. జ్ఞాన కర్మయోగాలు దానికి రెక్కలు. పక్షి రెక్కలు రెండు సమానం. వాటిలో ఏది గొప్పదన్న ప్రశ్న వుండదు. అవి దాని గమనానికి ఉపకరణాలు మాత్రమే! పక్షివాటికి అతీతంగా వుంది. మనం పక్షిని దృష్టిలో వుంచుకోవాలి. అనంతమైన ఆకాశం దాని ముందు పరచుకొని వుంది లక్ష్యాభిముఖంగా అది సాగుతోంది.

ముక్తి అంటే అమృతత్వమేగాని జీవనాశనం కాదు. ఆత్మవిదులు కూడ జన్మిస్తారు. వారికిజన్మంటే భయం వుండదు. స్వకీయమైన ప్రకృతిని అధిష్ఠించి ఆత్మశక్తిచే తనను తాను సృజించుకొని లోకకల్యాణార్థం ఇహలోకంలో జన్మిస్తున్నానన్నారు శ్రీ కృష్ణులు. వారికి ముక్తి అంటే ప్రకృతి పై ఆత్మ యొక్క ఆధిపత్యం. సంపూర్ణ ఆత్మస్వాతంత్ర్యం. శ్రీకృష్ణులకు అవసరం లేని జన్మరాహిత్యం మనకెందుకన్నారు మాష్టారు.

నిర్యాణం

ఒకనాడు మాష్టారి తలకు నూనెరాసి మర్దనా చేస్తుండగా వారి శిరోమధ్య భాగంలోను, దానికి చుట్టుపట్ల పల్చటి పొరచే కప్పబడ్డ రెండు మూడు రంధ్రాలు కనిపించాయి. "యోగులు అంత్యకాలంలో శిరస్సు నుండి ప్రాణం విడుస్తారని అంటారు. మీరు కూడ ఆవిధంగా చేస్తారా?" అని వారిని అడిగాము. దానికి వారు "నేను సామాన్యమానవునిలా మరణిస్తాను" అన్నారు.

తరచుగా వారికి సుస్తీ చేసేది. అప్పుడు సర్వశ్రీ పెన్మెత్స నారాయణ రాజు, రామభద్రరాజు సోదరులు వారిని తమ స్వగ్రామం కొత్తపాడు తీసుకొని వెళ్ళి వైద్యం చేయించేవారు.1962వ సంIIరం సెప్టెంబరు నెలలో వారకి సుస్తీ చేయగా తణుకులో వైద్యం చేయించి కొత్తపాడు తీసుకొని వెళ్ళారు. ఒకనాటి రాత్రి బాధ ఎక్కువకాగా వారిని తణుకు తీసుకొని వచ్చి వైద్యం చేయించసాగారు.24-9-1962వ తేదీన వ్యాధి ఉధృతమైంది. "పిల్లలు చిన్నవాళ్ళు. మరికొంత కాలం మీరుండాలి" అని భక్తులు వేడుకోగా "ఇంకెంత కాలం యిలా వుండమంటారు" అన్నారు. మధ్యాహ్నానికి పరిస్థితి విషమించింది. నారాయణరాజుగారు వారిని దువ్వలోని ఆశ్రమానికి తీసుకొని వచ్చి మంచపై పరుండ బెట్టారు. భక్తులు భగవద్గీతను పఠిస్తుండగా ఆమహాయోగి శరీరాన్ని త్యజించారు.

రచనలు

ఆత్మ విదులు రచనలు చేయటం చాల అరుదుగా సంభవిస్తుంది. 1958వ సంIIరం జనవరి నెలలో మాష్టారు భగవద్గీత పై రెండు వ్యాసాలు వ్రాసారు. గీతల తత్వదర్శనం, వ్యావహారిక ప్రయోజనాలను వివరిస్తూ వ్రాసిన వ్యాసం వాటిలో మొదటిది. దీనిని 23-1-1958వ తేదీన ముగించారు. తరువాత ఏ మహా సంకల్పం వారిని ప్రేరేపించిందో తెలియదు గాని వ్యాసరచితమైన "మూలగీత"ను అన్వేషించి,ఆవిష్కరించే ప్రయత్నానికి పూనుకొని కేవలం గీతల స్వరూప నిర్ణయము మరియు శ్రీకృష్ణోపదేశము, వ్యాస భగవానుల రచనా సౌందర్యాలను వివరిస్తూ "భగవద్గీత" అనే పేరుతో మరో వ్యాసాన్ని వ్రాసారు. దీనిని 29-1-1958వ తేదీన పూర్తి చేసారు. వాటిని ఆశ్రమంలో ఒకనాడు మాచేత చదివించారు. నాడు మాబుద్ధి వాటని అర్థంచేసుకొని, ఆనందించే స్థితికి ఎదగలేదు. వారు వాటి ముద్రణను గూర్చి నాడు పట్టించుకొనలేదు.

1962వ సంII రం ఆగష్టు నెలలో ఒకనాడు వారిని ఆశ్రమంలో దర్శించుకొని మరునాడు మరలి వస్తుండగా వారు వ్రాసిన వ్రాతప్రతులను మాకిచ్చి అసంపూర్ణాలుంటే పూరించి, గ్రంథ రూపానికి తెచ్చి ప్రకటించమని అన్నారు. అవి మావద్ద చాల కాలం వుండి పోయాయి. కాలక్రమంగా మాలో సమ్యక్ ఆలోచన, శాస్త్రీయ పరిశీలనా దృక్పథము పెంపొందగా 1985వ సంII రంలో వారి రెండో వ్యాసం "భగవద్గీత" మా బుద్ధిని ఆకర్షించింది. దాని ఓజశ్శక్తికి, లోచూపుకు పరవశులమై 1986వ సంII రంలో దానిని "భగవద్గీత (మూలగీత – గీతాక్షేపకము)" అనే పేరుతో ప్రకటించి విశ్వవిజ్ఞాన క్షేత్రంలో ప్రవేశపెట్టాము.

ఇకపోతే మొదటి వ్యాసాన్ని గురించి: మేము చాలకాలం దీనిని అసంపూర్ణమని భావించాము. అవ్యయ యోగాన్ని గూర్చి వ్రాసి దీనికి చేర్చవలసి వుందని అనుకొన్నాము. కాని ఆ ప్రయత్నం ముందుకు సాగలేదు. చివరకు దీనిని యథాతథంగా ప్రకటించటానికి నిశ్చయించుకొని ముద్రణకు సిద్ధపరుస్తుండగా యిది అసంపూర్ణం కాదని గ్రహించాము. దీనిని "గీతలజైత్రయాత్ర" అనే శీర్షికతో యిప్పుడు ప్రకటిస్తున్నాము. ఈ సందర్భంలో రెండు మాటలు.

మొదటి నుండి మాష్టారి రచనలు మాభావాలలోని దోషాలను తెలుసుకొని వాటిని దిద్దుకొనటానికి, మా మనోదర్పణం పై గల సాంప్రదాయ మరకలను తుడుచుకొని సత్యాన్ని మరింత స్పష్టంగా చూడటానికి తోడ్పడ్డాయి. అవి సజీవగ్రంథాలు. అవసరమైన కాలానికి ముందుగా వచ్చాయి. వాటిలో స్వవచన విఘాతము, పునరుక్తి, అప్రస్తుత ప్రశంసలు మచ్చుకు కూడ దొరకవు. వాటిలోని భాష అంతస్ఫూర్తి వైశాల్యాలతో గర్భితమైన ఋషిభాష. అందుకే వాటిని వ్యవహారిక భాషలోనికి తెచ్చిప్రకటించాలని ప్రయత్నం చేసి కూడ విరమించుకొన్నాము.

"తండ్రి మరణించి మిగిల్చిన పనిని పుత్రుడు పూర్తి చేస్తాడు. అందుకే వాడు పుత్రుడనబడతాడు" అంది బృహదారణ్యకం. గర్భవాసాన జనించిన వారేగాక శిష్యులు కూడ మహర్షులకు పుత్రులే! నేటికి మాష్టారి రచనలు రెంటినీ ప్రకటించి మా పుత్ర ధర్మాన్ని నెరవేర్చుకొన్నాము. ఈ ప్రక్రియలో మేము స్వయం ప్రకాశము కలిగి వేవెలుంగులు వెదజల్లు జనని "మూలగీత" యొక్క స్వరూప, స్వభావాలను దర్శించి, ఆమె వాణిని విని ఆమె పాదముల కడ మోకరిల్లి పరవశించి పులకరించినాము. వ్యాస తాత్పర్యరచనా సౌందర్యాన్ని తిలకించి ముగ్ధులమైనాము. వైశంపాయనాది మహనీయుల భావవైశాల్యానికి అంజలి ఘటించినాము. ఇటువంటి మహద్భాగ్యం మాకు ప్రాప్తించటానికి కారణమైన మాష్టారి శేముషీ వైభవానికి కృతజ్ఞులమై చేతులెత్తి నమస్కరిస్తున్నాము.

పి. వి. ఆర్. ఎన్. శర్మ,
పెన్మెత్స రామభద్రరాజు



రాచకొండ వెంకట నరసింహ శర్మగారు

జననం : 17-12-1910 మరణం : 24-9-1962

గీతల జైత్రయాత్ర

1 మహాభారతము

1. దార్శనిక యుగ ప్రయోగము

సృష్టితత్త్వము, మానవతత్త్వము, బ్రహ్మతత్త్వములను గురించిన ...యములు మనకు ఉపనిషత్తుల వలన తెలియుచున్నవి. ఉపనిషదులు ...ని భిన్నాభిప్రాయముల ద్వారా నిరూపించినవి. ఒక ఉపనిషత్తునకు ...రొకటి విరుద్ధముగ గానబడు చున్నది. ఉపనిషత్కాలానంతరము రెండు ...బ్దములలో విభిన్న సిద్ధాంతముల ప్రవాహము వచ్చినది. ఈ కాలము ...ు చెందిన వాఙ్మయము చాలా వున్నది. దానికి నేటి వరకు సరైన ...పయోగము కలుగలేదు. శ్వేతాశ్వతరము; మైత్రిలాటి ఉపనిషదులందు ...నేక మతములు గానవచ్చు చున్నవి. కాపాలిక దర్శనము, బృహస్పతి ...ర్శనము, కాలవాదము, నియతివాదము, స్వభావవాదము, యదృచ్ఛావాదము ...త్యాదులు. పంచరాత్ర సాంప్రదాయము నకు చెందిన "అహిర్బుధన్య" ...హితయందు బ్రహ్మతంత్రము, రూపతంత్రము, నియతి తంత్రము, ... తంత్రము, గుణతంత్రము, అక్షరతంత్రము ...... జ్ఞానతంత్రము, ...మాతంత్రము, భూతతంత్రము .... యిత్యాది ముప్పది రెండు ...త్రములు గానబడుచున్నవి. జైనమత గ్రంధములందు అరువది మూడు ...ర్శన సిద్ధాంతములు గలవు. బౌద్ధమత గ్రంధములలో అరువది రెండు ...ద్వైతర మతములు పేర్కొనబడినవి. మహాభారతము ఆనాటి దార్శనిక ...యుగ ప్రయోగముగ తెలియుచున్నది.

2. ఆస్తిక విచారధార

మహాభారతములో సప్రపంచ, నిష్ప్రపంచ-సగుణ, నిర్గుణ బ్రహ్మముల వివరములు రెండును గలవు. అయితే సగుణబ్రహ్మకు సంబంధించిన విషయము నకు ప్రాధాన్యమీయబడినది. ఏకేశ్వరవాదము నాటికి పరిపక్వము చెందినది. వైదిక కాలము నకు చెందిన ఇంద్ర, వరుణాది దేవతల స్థానమును బ్రాహ్మణముల కాలమున ప్రజాపతి గ్రహించెను. ఇతడే తరువాత బ్రహ్మగా వ్యాహృతుడయినాడు. తదనంతర కాలము నకు చెందిన శ్వేతాశ్వతరమునందు రుద్రశివుల ప్రాముఖ్యము హెచ్చెను. దరిదాపు ఆకాలముననే విష్ణువు కూడ ప్రాముఖ్యతను పుంజుకొనుచుండెను. మహాభారత కాలమునకు విష్ణువు సర్వప్రధాన దైవముగా మారెను. వాసుదేవకృష్ణుని మహత్తు హెచ్చినది. కృష్ణుని యొక్క ఈశ్వరత్వము సునాయాసముగ సిద్ధించలేదనుటకు మహాభారతమే సాక్ష్యముగ నున్నది. ధర్మజుని రాజసూయమున ఈ సిద్ధాంతము శిశుపాలునిచే అవమానింపబడినది. ఈకథ సుప్రసిద్ధము. ఈ కాలముననే దర్శన శాస్త్రముల బీజాంకురములు బయలుపడినవి. గీతల రచనా కాలము నాటికి ప్రస్తుత ప్రచలిత దర్శన శాస్త్రములు ప్రౌఢత జెందియుండెనని భావింపరాదు. నాటికి సాంఖ్య సిద్ధాంతము ప్రసిద్ధిలో నుండెను. మహాభారతములోని సృష్టివర్ణన సాంఖ్యాను కూలముగ నున్నది. శ్వేతాశ్వతరము మరియు గీతలు "సాంఖ్య" శబ్దమును వినియోగించినవి.

3. వ్యావహారిక మత భేదములు

వ్యావహారిక శాస్త్రములో అనేక సిద్ధాంతములు వికసించుచుండెను. ఉపనిషత్తుల నిర్గుణ బ్రహ్మము, శుష్క జ్ఞానముచే విసుగుజెందిన ప్రజలు తిరిగి బ్రాహ్మణముల కాలము వైపుకు వెను తిరిగిరి. కర్మవాదము క్రియావాదము వైపు తిరిగినను, వాటి స్వరూపములు మార్పు చెందుచుండెను. యజ్ఞాదికర్మలు స్వర్గసాధనకు మారుగా చిత్తశుద్ధికి సాధనములుగనే వుండెను. మహాభారతములో ఒక అధ్యాయమునకు "యజ్ఞనింద" అను శీర్షిక గలదు. యజ్ఞము నందు చేయబడు పశుహింస అతికఠినముగ విమర్శించబడినది. "అహింసా సకలో ధర్మః" అను సూక్తి ప్రచారము నకు వచ్చినది. ఉపనిషత్తులలో

జ్ఞానము వలననే ముక్తి కలుగు ననువారు తద్విరుద్ధముగ ఉపదేశించు డిరి. జ్ఞానము మరియు కర్మకు అతిరిక్తముగ నాడు భక్తి మార్గమునందు రుచి కలుగుచుండెను. మహాభారతమందలి నారాయణీయ ఉపాఖ్యానము ప్రప్రథమ భక్తిప్రాతిపదికగల సాహిత్యము గానబడు చున్నది. తదుపరి ప్రాధాన్యత గలది భగవద్గీతయే! శాండిల్య, నారద భక్తి సూత్రములు తరువాతి కాలమునకు చెందును. ఆకాలము ననే యోగక్రియల త్తు కూడ హెచ్చుచుండెను. ఈవిధముగా నాడు జీవితలక్ష్యమును టకు నానావిధ విమర్శకులు కర్మ, జ్ఞాన, భక్తి మరియు యోగ ములను ఉపదేశించుచుండిరి.

4. నాస్తిక విచారధార

ఆస్తిక సిద్ధాంతములందున్న విభిన్నతను, మతభేదమును (విరుద్ధతను) నాస్తికత, అవిశ్వాసముగల భావములు కలుగుచుండెను. ప్రశ్నయేమనగా త్యమనునది ఒకే ఒకటైతే, దానిని అవలంబించు వారిలో యింత న్యత ఏల కలుగవలయును? శృతులను నమ్మువారే తమలో తాము కలహించుకొనుచున్నారు? విశ్వతత్వ స్వరూపమేమి, అందు మన మేమనెడి ప్రశ్నలకు సమాధాన మొసగ ప్రయత్నించిన ప్రపంచ కులం దైకమత్యముగాన వచ్చుట లేదు. బృహస్పతి అను విద్వాంసుడు భావములను సూత్రములుగ ఒక గ్రంధమును రచించెను. అది తము లభ్యమగుటలేదు. బృహస్పతి శిష్యుడు చార్వాకుడు. ఇతడు ులలో గల వైదిక స్మార్తధర్మావలంబులను, వారి సమర్ధకులను ఠినముగ, తర్క సహితముగ ఖండించినాడు. నాస్తిక దర్శనములలో ్వాక దర్శనము ప్రధానమైనది. ఇది ఒక విధమైన జడవాదము. భారతీయ ాద శృంఖలాబద్ధమైన సాహిత్యము నేడు గానవచ్చుటలేదు. ంములందు అక్కడక్కడ లభించును. బృహస్పతి చార్వాక దర్శనప్రవక్త డుచున్నాడు. బృహస్పతి సూత్రములు ఈదర్శనము నకు ్రంధము. ఈసూత్రములు "సర్వదర్శన సంగ్రహము" లో గలవు. సామాన్యజనులకు వారి జీవితోద్దేశ్యమును తెలియబరచునుగాన దీనినే ాయత" దర్శనమని కూడ అందురు.

సామాన్యజనులు ప్రాయః దేనిని చూతురో దానినే సత్యమని భావింతురు.

వారిదృష్టిలో ఈ భౌతికజగత్తు నిశ్చితమైన, సర్వశ్రేష్ఠమైన సత్యమ
ఐహికసుఖమే పరమశ్రేయము. ప్రత్యక్షము, అనుభవనీయమైనదే ప్రమాణమ
చార్వాకమతానుసారము ఈభౌతిక జగత్తు సత్యమైనది. దీని కతిరిక్తములున
అభౌతికములును అగు ఏ సత్యములను తదితర దర్శన శాస్త్రము
ఊహించు చున్నవో - అవన్నియు కేవలము కల్పితములు. ఆత్మ
ఈశ్వరుడు, స్వర్గము అనునవి లేనే లేవు. వీటి అస్తిత్వమును నమ్ము
వ్యర్థము. భూమి, జలము, వాయువు, అగ్ని అను నాలుగు భూతము
ద్వారా ఈ భౌతిక జగత్తు నిర్మించబడినది. (చార్వాకమతము నాలు
భూతములనే ఒప్పుకొనును. పంచమభూతమైన ఆకాశము ప్రత్యక్షాను భూతిక
లేదుగాన ఒప్పదు.) ఈ నాలుగు భూతముల యోగము (కలయిక) వ
జగత్తునందలి పదార్థములన్నియు ఉత్పన్నములగు చున్నవి. ఆత్మఅనుదా
వేరే సత్తాలేదు. అది మదశక్తి వంటిది. ఈ నాలుగు భూతముల కలయి
(యోగము) వలన చైతన్యము జనించును. మృత్యుతదనంతరము జీవుడ
పదార్థమేదియు. శేషించుటలేదు. చతుర్భూతములు లయించు చున్న
వాటి యోగము వలన కలుగు చైతన్యము నశించుచున్నది. అందు
పరలోకము, స్వర్గము, నరకము కవులు సృజించినవేగాని వాస్తవము
వాటికి సత్తాలేదు. ఈశ్వరుడు ప్రత్యక్షముగా జ్ఞేయ పదార్థము కాదుగా
అసత్యము. ఈ జగత్ సృష్టి నాలుగు భూతములచే, తనంతటతా
జరుగుచున్నది. భూతముల స్వభావము ఈవ్యవస్థకు కారణము. రా
ప్రజలను నియంత్రతలో నుంచును. అందుచే జగత్స్రష్టగను, నియంతగ
ఈశ్వరునిఅవసరము లేదు. ఈలోకములో రాజే పరమేశ్వరుడు.

ఏదర్శనమైతే ప్రత్యక్షమునే ప్రమాణమని సిద్ధాంతీకరించినద
భౌతికజగత్తు మాత్రమే ఏకైక ధృవసత్యమని నిరూపించినదో - దాని
మానవుడు జీవితలక్ష్యమును పొందుటకు అవకాశము లేదు. ఏలన భౌ
జగత్తే ధృవసత్యమైతే - ఐహిక సుఖములే పరమశ్రేయములగును. సుఖే
మానవ స్వభావము. కావున సుఖించుటకు ఏకర్మ చేసినను వుచిత
అగును. ఆత్మ, ఈశ్వరుడు, పరలోకములను అంగీకరింపనిచో - ధర్మము
అధర్మముల యొక్క భేదము చూచుట వ్యర్థమగును. పర్యవసానము
పశుబలమే శ్రేష్టమగును. మానవుడు దీనిని అంగీకరించుట లేదు.

వేదములను, వైదిక కర్మలను బృహస్పతి అతికఠోరముగ నిందించి
విమర్శించినాడు. వేద నిర్మాతలు ధూర్తులు, పాషండులు, నిశాచరుల

న్నారు. వేదము, వైదిక కర్మ సత్యములు కావు. అవి బుద్ధి, ...
రోహితుల జీవిక సాధికకు ఉపకరణములు మాత్రమే! ...
చేయు పశువు స్వర్గమున కేగిన ఎడల – యజ్ఞము ...
చ్చితిన్నగా వానిని స్వర్గమున కేల పంపరాదు? ...
డములందించు వారు ప్రయాణసమయమందు తమవెంట ...
ట్టకొని పోవుట అనవసరము. ఏలన యింటి వద్దనున్నవారు ...
ట్టిన ఎడల ప్రయాణము చేయుచున్న వ్యక్తికి ఆహారము ...
? ! ఈకారణము వలన నైతిక, వైదిక కర్మలు ...
లము సుఖమే పరమ పురుషార్థము. దానినే భోగించి ...
దవలయును. ఒక పర్యాయము దేహము భస్మమయిన ...
క్కడ? ప్రాణుల అవనతికిగాని, ఔన్నత్యమునకు గాని ...
ు. హేతురహితముగనే అవి జరుగుచున్నవి. ...
యోనుల పిదప జీవుడు, దుఃఖము, అజ్ఞానము, ...
ంతట తామే దూరముగ తొలగును. నియతి, స్వభావము, ...
న యిదంతయు జరుగుచున్నది. మానవ ప్రయత్నము, ...
ర్థము. యజ్ఞము, దానము, తపములన్నియు నిష్ఫలితములు. ...
రణ వట్టి భ్రమ.

ఆనాడు ఈవిధమైన నాస్తిక భావములను, ...
జాసముదాయము లందు ప్రచారము చేయుటకు తగినంతమంది ...
ులుదేరిరి. కర్తవ్యాకర్తవ్యములు రెంటికిని గల తారతమ్యమునే ...
నుకొనిరి. సామాజిక (సంఘ) జీవితము యొక్క పునాదినే ...
ు సిద్ధపడిరి. ఈవిధమైన బోధ సామాన్య మానవుల ...
ండెను. నాస్తిక దర్శనము జనులసొత్తు, హక్కు అగుటకు ఈ ...
ద్పడినది. ఆస్తికదర్శన శాస్త్రజ్ఞులకు తమ ఉద్దేశ్యములను, సిద్ధాంతములను
బోధముగను, వ్యవహారికముగను, సులువుగను జేసి సర్వసామాన్య ...
ూహము ముందుంచుట అవసరమనిపించెను. హిందూ ...
ందూబుద్ధికి ఈసమయము చాల ప్రమాదకరమైనది. ...
వద్గీతా రచయిత వివిధములైన ఆస్తిక అభిప్రాయములను ...
్తిక వాదులు, వారి సమర్థకుల పైనను మరియు వైదిక ధర్మ విరోధుల పట్ల
మ్మిళిత యుద్ధమునకై క్షైత్రయాత్రకు పూనుకొనెను.

II. శ్రీమద్భగవద్గీత

1 వ్యవహారిక శాస్త్రము

ప్రస్తుత ప్రచలిత భగవద్గీతలు పంచమవేదమైన మహాభారతమ భీష్మ పర్వములో గలవు. భారత యుద్ధారంభమున యుద్ధసన్నద్ధులైన కురుపాండవ సేనలు రెంటిని చూచిన అర్జునులవారి హృదయములో గురుజనులను హత్యగావించిన ఏమగుననెడి మోహము జనించుటతో గీ ఆరంభమగుచున్నవి. ఆసమయముననే శ్రీ కృష్ణభగవానులు గీతోపదే జేసిరి. మహాభారతములో గీతలొక్కటియేగాక ఆనాటి సామాజిక, నై రాజనైతిక, ధార్మిక మరియు దార్శనిక అభిప్రాయములు గలవు. సాంఖ్య యోగము, వేదాంతముల కూర్పు కలదు. శాంతి పర్వమును నాటి దార అభిప్రాయముల విశ్వకోశమని పిలువవచ్చును. ఈపర్వములో రాజధర్మ ఆపద్ధర్మము మరియు మోక్షధర్మముల వర్ణనలు గలవు. ఆసురి, క జనక, మైత్రేయాది నామములు గోచరించుచున్నవి. వంశవృక్ష తీర్థమహత్యములు మున్నగునవి రెండవ విశేషము.

భారతీయ దర్శన శాస్త్రముల పోకడ వ్యవహారికము కాదను గీతలను చూచిన పిదప తమ అభిప్రాయమును మార్చుకొందురు. భారతీ మస్తిష్కము యొక్క ప్రాముఖ్యము కూడ వారికి స్పష్టమగును. గీతలను పర్యాయము పఠించినవారు భారతీయులకు వ్యవహారిక శాస్త్రము న అభిరుచి లేదనునిందను మోపజాలరు. అర్జునులవారి ఎదుట ఎటువ సమయములో, ఎలాటి కర్తవ్యాకర్తవ్యమను వ్యవహారిక సమస్య ఎద వచ్చెనో – అటువంటి సమయములు, సమస్యలు అనేక దేశముల అనేక ధర్మపరాయణ మానవులకు కలిగి యుండవచ్చును. కాని అల కఠిన సమస్యను సువిదితముగను, విపులముగను, సువిశాలముగను వ్యక్తపర తిరిగి అన్ని విధముల ఎదుర్కొనుటకు, సమాధానపరచుటక నిర్ణయించుకొనుటకు గీతలొసగిన సామగ్రి విశ్వసాహిత్యమున గల మరియే గ్రంథమున దొరకుట దుర్లభము. గీతలు లోకప్రియములగుటకిదే కారణవ వ్యవహారిక శాస్త్రములో గీతలు ప్రపంచ విఖ్యాత విద్వాంసుల యొక ముఖ్యోద్దేశ్యములను, ఆలోచనలను పొందుపరచుకొని యున్నవి. ఓ వలన తాత్వికముగా గీతలకు న్యూనత కలిగినదని గాని, మహత్తు తగ్గినదని గ

అర్థమును తీయరాదు. ఏలన తాత్విక మీమాంస మరింత విపులమై ధృఢపడుటకు యిది సహాయభూతమైనది.

2. తత్వదర్శనము

గీతల యొక్క విశ్వతత్వమునకు సంబంధించిన విషయముపై ఉపనిషదుల ముద్ర స్పష్టముగ నున్నది. సాంఖ్యము యొక్క ఆలోచనా బాహుళ్యమును గలదు. గీతలకు ఉపనిషత్తులకు మధ్య ముఖ్యమైన భేదము కలదు. ఉపనిషదులు నిర్గుణబ్రహ్మము నకు, నిర్గుణమునకు ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను యిచ్చినవి. గీతలు సగుణ బ్రహ్మయొక్క శ్రేష్టతను నిరూపించినవి. <u>బ్రహ్మము యొక్క నిర్గుణత్వమును గీతలు అంగీకరించుచున్నవి.</u> సంపూర్ణ విభక్త వస్తువులందేది అవిభక్తముగ విరాజిల్లు చున్నదో; దేనిని సత్ అనిగాని, అసత్‌అనిగాని చెప్పుట కలవికాదో; ఏదిసూక్ష్మము, దుర్భేద్యమై యున్నదో; ఏది జ్యోతిస్వరూపములకు జ్యోతిగను, అంధకారము నకు ఆవలగలదో; ఏదైతే జ్ఞాత, జ్ఞానము జ్ఞేయమై యున్నదో" అట్టి బ్రహ్మతత్వమును వర్ణించుటకు, దాని గుణములను గానము చేయుటకు గీతలు వెనుకాడవు. అయినను వాటి అనురాగము సగుణ బ్రహ్మము నందే అధికముగ కలదు(12–2). బ్రహ్మసూత్ర శబ్దములలో "దేని నుండి సమస్త జగత్తు యొక్క ఉత్పత్తి, స్థితి అగుచున్నదో, మరియు ప్రళయ కాలమున దేనిలో సమస్త జగత్తులయమగు చున్నదో" అట్టి దానికి ప్రాముఖ్యతను గీతలు సగుణమున కిచ్చుచున్నవి. బ్రహ్మము యొక్క అశేష (అవ్యయ) పదార్థములు అందుండియే వచ్చుచున్నవి. సగుణ బ్రహ్మగాని భగవంతునకు రెండు ప్రకృతులు గలవు. ఒకటి పరాప్రకృతి. రెండవది అపరాప్రకృతి. పృధ్వి, జలము, తేజస్సు, వాయువు, ఆకాశము, మనసు, బుద్ధి మరియు అహంకారము అను ఎనిమిది విధములుగా "అపరా" ప్రకృతి వున్నది. "పరా" ప్రకృతి జీవరూపము అధవా చైతన్య రూపముగ జగత్తును ధరించి వున్నది. (7–4,5) అపరాప్రకృతి వాస్తవముగా సాంఖ్యము యొక్క "మూల ప్రకృతి" మరియు శ్వేతాశ్వతరము యొక్క "మాయ". దీనినే "అవ్యక్తము" అని కూడ అందురు. బ్రహ్మకు పగలు ఆరంభించినప్పుడు సమస్త వ్యక్త పదార్థములు వ్యక్తములగు చున్నవి. బ్రహ్మకు రాత్రి అయినపుడు ఆ అవ్యయ సంజ్ఞకమైన దానితో లయమగుచున్నవి (8–18). సమస్త విశ్వయోనికి కారణమైన ప్రకృతిని

గీతలు "మహద్బ్రహ్మ" అని కూడ చెప్పినవి. స్వయముగా భగవానుడు దీని యందు (అవ్యయమగు) బీజారోపణము చేయు చున్నాడు (14–3). ఈ అవ్యయమహద్బ్రహ్మ అథవా ప్రకృతి సత్వ, రజ, తమో గుణాత్మకమై భౌతిక, మానసిక, వ్యవహారిక క్షేత్రములందు సర్వవ్యాప్తమై వున్నది. సాత్విక, రాజసిక, తామసికములను మూడు విధములుగ ఆహారములున్నవి. అట్లే శ్రమ, యజ్ఞము, దానము, తపస్సు మొదలగు కర్మలు త్రివిధములుగ నున్నవి. ప్రకృతి యొక్క గుణములే మన కర్మలకు కారణములగు చున్నవి. వాస్తవముగా కర్తృత్వమును వహించునది ప్రకృతియే! కర్త్రియే ప్రకృతి. అహంకార వశులమై మనమే కర్తలమనుకొను చున్నాము (3–27) .ఈఅవ్యక్తము కంటె ఆవల మరొక పదార్థము కలదు. అది స్వయముగా అవ్యక్తము మరియు సనాతనమైనది. అది సమస్త భూతములు నశించినప్పటికిని నశించదు. దీనినే అక్షరమని అందురు (8–20,21) "భూతములన్నియు క్షరములనబడుచున్నవి. కూటస్థుడు అక్షరమన బడుచున్నాడు. ఉత్తమ పురుషుడు ఈరెంటి కంటె భిన్నముగ నున్నాడు. దీనినే "పరమాత్మ" అనుచున్నారు. ఈఅవ్యయ ఈశ్వరుడు మూడు లోకములను వ్యాపించి, భరించి పోషించుచున్నాడు" (15–16,17)

భగవానుడే ఈసంసారము నందలి సమస్త వస్తువులకు ఆధారభూతుడు. అతనిలో అన్నియు గ్రుచ్చబడి యున్నవి (7–7) అతని నుండియే అన్నియు ప్రవర్తింపబడు చున్నవి (10–8). ఏడవ, తొమ్మిదవ మరియు పదవ అధ్యాయములలో కొన్నిచోట్ల భగవానుని విభూతులు వర్ణింపబడినవి. సంసారమందలి సత్, అసత్ పదార్థములన్నియు భగవానుడే! పృథ్వియం దాతడు గంధము. సూర్యచంద్రులలోని ప్రకాశము. సమస్త భూతముల యొక్క జీవనము. తపస్వుల యొక్క తపస్సు (7–9). అతడే ఋతువు, యజ్ఞము, స్వధ, ఔషధము, మంత్రము, ఆజ్యము మరియు హవ్య పదార్థము. సంసారము నకు గతి, భర్తా, ప్రభువు, సాక్షి, నివాసస్థానము, సుహృదము, ఉత్పత్తి, ప్రళయము, ఆధారము మరియు నాశనములేని (అవ్యయ) బీజము భగవానుడే ! (9–16,18)

అతడన్ని భూతములందును గలడు. ఆదిత్యులలో విష్ణువాతడు. జ్యోతులలో సూర్యుడు. మరుత్ గణములలో మరీచి. నక్షత్రములలో చంద్రుడు. అక్షరములలో "అకారము" . సమాసములలో ద్వంద్వము. అక్షయమైన కాలము. అతడే అన్నిటిని ధరించువాడు. సర్వతోముఖుడు.

ర్వమును హరించు మృత్యువు. భవిష్యత్తులో పుట్టబోవు పదార్థములకు త్పత్తి. స్త్రీల యొక్క కీర్తి, శ్రీ, వాణి, స్మృతి, బుద్ధి, ధైర్యము మరియు హనము భగవానుడే! (10–20, 21,33,34).

పదకొండవ అధ్యాయములో (అవ్యయ) రూపమగు విశ్వరూపమును శ్రీ కృష్ణభగవానులు అర్జునులకు చూపి, విభూతులు మరియు ఈ సంసారము కమనే అవలంబించి వున్నట్లు ప్రత్యక్షాను భవమును కలిగించిరి. దానితో పాటు తనను తాను భగవానున కర్పించుకొని, భగవదుద్దేశ్యమును పూర్తి గావించుటకు గాను కర్మ చేయవలెనని అర్జునులకు ఉపదేశించిరి (11–55)

ఈ విధముగా గీతలు తమ తత్వదర్శనము నందు సాంఖ్యుల పకృతివాదమును, వేదాంతుల (ఉపనిషదుల) బ్రహ్మవాదమును, భాగవతుల భక్తుల) ఈశ్వరవాదమును – ఈమూడింటిని సమన్వయించినవి. కర్మ, జ్ఞాన, భక్తి మార్గములు వేరువేరుగా గాక వాటినన్నిటిని ఒకే ఒక యోగమగు అవ్యయమునకు జేర్చి, ఈయోగమే తమ యోగమనియు. దీనిని అవలంబించియే తాము జన్మలను ఎత్తుచున్నట్లుగా శ్రీ కృష్ణభగవానులు గీతలలో విశదీకరించిరి (4–1,6)

3. వ్యావహారిక ప్రయోజనము

మానవజీవితము యొక్క వ్యావహారిక సమస్యలపై ఆధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మిక ప్రభావములను విశదీకరించుటయే గీతల యొక్క ముఖ్య ప్రయోజనము, అభిప్రాయమై వున్నది. తత్వదర్శముగాని తత్వమీమాంస గీతాకారునకు వ్యావహారిక సిద్ధాంతముల వరకు జతపరచుటకు ఉపకరణము మాత్రమే! గీతల యొక్క వ్యవహారిక ఉపదేశములపై అనేక మహత్తర గ్రంధములు రచించబడినవి. వాటిలో లోకమాన్య బాలగంగాధర తిలక్ గారి "గీతా రహస్యము" నకు విశేష (విశిష్ట) స్థానము గలదు. శంకర భగవత్పాదుల వారు తమగీతా భాష్యములో కర్మకన్న జ్ఞానమే గీతల తాత్పర్యమని నిరూపించుటకు ప్రయత్నించిరి. కర్మ వలన మోక్షప్రాప్తి ఎన్నటికిని కలుగనేరదనియు, ఎవరి బుద్ధి వేదాంత సిద్ధాంతములను అర్థము జేసుకొనుటకు పరిపక్వము కాలేదో – అట్టి దిగువ శ్రేణికి చెందిన అధికారులకు మాత్రమే నిష్కామ కర్మోపాసనాత్మకమైన కర్మయోగము గీతలలో చెప్పబడినదని శంకరుల అభిప్రాయము. తిలక్ పండితులు

శంకరుల వారి ఈవ్యాఖ్యను ఖండించి గీతలు కర్మ సన్యాసమును గాని, కర్మత్యాగమును గాని ఉపదేశింపక కర్మయోగమునే ప్రతిపాదించినవని నిరూపించిరి. ఇంతకు ముందు చెప్పబడినట్లుగా గీతా యుగము(కాలము)లో మోక్షార్థులకు జ్ఞాన, భక్తి, కర్మ, యోగ మార్గములు ప్రచారములో నున్నవి. తమ తత్వదర్శనము వలెనే గీతలు వ్యవహారిక క్షేత్రములందు కూడ సమన్వయించుటకు ప్రయత్నించినవి. ఇక దానిని చూపుటకు ప్రయత్నించెదము.

4. స్వతంత్ర సిద్ధాంతములు

జీవిత వ్యాపార విషయములో గీతలు కొన్ని విశిష్టములైన స్వతంత్ర ధారణలను కేంద్రీకరించు కొని, వాటిలో విభిన్న మార్గముల యొక్క సత్యములను ఒకచో సంగరితము జేయుటకు ప్రయత్నించినవి. ఈ స్వతంత్ర సిద్ధాంతములు మనకు తెలిసిన మట్టుకు మూడు కలవు. మొదట వీటిని బాగుగా మనసునకు నాటించుకొనని ఎడల, గీతల సరియగు అభిప్రాయమును తెలుసుకొనజాలము.

(1) మానవునకు తన ఆధ్యాత్మికోన్నతికి మనసు మరియు యింద్రియముల విగ్రహము పరమ ఆవశ్యకమనియు, అతికఠినమైన నియమమనియు గీతలు ఆదేశించు చున్నవి. విషయములను ధ్యానించుచున్న ఎడల మానవునకు వాటి యందు ఆసక్తి కలుగును. ఆసక్తి వలన కామము (వాసన) జనించు చున్నది.కామము నెరవేరనందు వలన క్రోధము పుట్టుచున్నది. క్రోధము వలన మోహము జనించును. మోహము వలన స్మృతి నశించును. స్మృతి నశించిన బుద్ధి భ్రష్టమగును. దాని వలన మానవుడు పతితుడగు చున్నాడు (2–62,63) కామ, క్రోధ, లోభములు నరక ద్వారములనియు, ఈమూటిని విడువవలెననియు గీతలు శాసించు చున్నవి (16–21). ప్రతి ఒక సాధకుడు – అతడు కర్మయోగిగాని, భక్తుడుగాని, జ్ఞానిగాని లేక ఏసాధన మార్గము నకు చెందిన వాడైనను సరే – యింద్రియమనో విగ్రహము గలవాడై యుండవలెను. ఇది గీతల దృఢశాసనము. గీతోక్త సాధనకు, సాధనావస్థకు ముందుగనే సాధకుడు యింద్రియ జయమునకు ప్రయత్నించ వలెను. ఈస్థితి ముందే కలిగి యుండవలెను. మరియు దైవీ సంపదగ పరిగణింపబడు గుణము లేవి గలవో – అవి ముముక్షువుల పట్ల స్వాభావికముగ వుండి వుండవలెను. వారి ప్రకృతి సత్వగుణ ప్రధానమైనదిగ

ఫుండవలెను. నిర్భయత్వము, శుద్ధత, స్వాధ్యాయప్రేమ, అమానిత్వము, సంభాభావము, రుజుత్వము, దానప్రియత (ఉదారత్వము) – యిత్యాది సెవీగుణములు మోక్షార్థులకు జన్మతః అథవా పూర్వ జన్మ సుకృతము వలన కలుగును.-అవిలేని ఎడల సాధించవలెను.

2. గీతల విశ్వాసమేమనగా – సాధన మార్గమున కొన్ని మజిలీలు గడచిన ఎడల సాధకునకు సమత్వబుద్ధి అథవా సామ్యభావన కలుగవలెను. కలిగితీరవలెను. కలిగి తీరును. సర్వత్ర సమబుద్ధి కలవాడే స్థితప్రజ్ఞుడు (2–57) సుఖదుఃఖములను సమభావముతో జూడగలవారు, బ్రాహ్మణ, శూద్ర, శునకాదులను సమముగ జూచువారు పండితులు. ఇక్కడనే వారు సృష్టిని గెలిచినవారు. ఏలన వారి మనసు సామ్యస్థితిని బడసినది. బ్రహ్మ, సముడు మరియు నిర్దోషి. అందుచే వారు బ్రహ్మలోస్థితి కలవారని తెలుకొనవలెను (5–18,19,20). సమత్వమే యోగమనబడుచున్నది (2–48). భక్తుడు కూడ సమదృష్టి కలవాడై వుండవలెను. భక్తి సమదర్శికావలెను. శత్రుమిత్రులు, మానావమానములందు సముడు, సుఖదుఃఖములను సమముగా జూచువాడు, ఆసక్తి రహితుడు, నిందాస్తుతు లందు ఒకేలాగున వర్తించువాడు, ఏది ప్రాప్తమైనదో దానితోనే సంతుష్టి చెందువాడు, గృహీనుడు, స్థిరబుద్ధి, భక్తికలవాడు అలాటి పురుషుడు భగవానునికి ప్రియుడు (12–18–19) సాధకులు ఏదర్శన సాంద్రాయము నకు చెందినను, ఏమతస్థులైనను, వారి వ్యావహారిక సాంప్రదాయములు, ఆచారములు, ఎలాటివైనను – వారు సమత్వ దృష్టిని అలవరచుకొనుట పరమ కర్తవ్యము. గీతల అభిప్రాయములో వారికి అనుసరించు మార్గములు కలవు.

3. గీతల స్వతంత్ర సిద్ధాంతములలో మూడవది, అన్నిటి కంటె మహత్తరమైన నిర్ధారణ ఏమనగా–మానవుడు సంకల్ప వికల్పములను త్యజించవలెను. ఫలాకాంక్షను, ఆపేక్షను విడువవలెను. సంకల్పములను ఎవరు త్యజించలేదో వారు యోగులు కానేరరు (6–2)

5. యోగము

గీతలలో యోగ శబ్ద ప్రయోగము పాతంజల యోగశబ్ద ప్రయోగము వంటిదికాదు. వస్తుతః గీతల కాలమునకు పతంజలి యోగశాస్త్రము తయారు కాలేదు. యౌగిక క్రియలు ప్రచారమునకు రాలేదు. గీతలలో "యోగ"

మనుదానికి పరిభాష అనేక ప్రకారములుగ నున్నది. "సమత్వమను దాని పేరే యోగము (2–48). "కర్మలలో నేర్పరితనమే యోగము" (2–50). యోగశబ్దమునకు సామాన్యముగ అర్థము కూడిక (కలియుట, కలుపుట) గీతల యొక్క "గీతాయోగము" నకు అర్థము – తన సామాజిక కర్తవ్యములన పూర్తిగావించుటకుగాను కర్మలందు మిళితమగుట అనగా మానవుడు ఫలాకాంక్షను అపేక్షింపక, కర్తవ్యబుద్ధితో కర్మలను ఆచరించుట. ఇదే కర్మయోగ మనబడుచున్నది.

గీతల రచనా కాలము నాటికి పతంజలి యోగమునకు గల అంగము లన్నియు సుసంగరితములుగాక యత్రతత్ర సాధికలో వుండి యుండ వచ్చును. ఒక క్రమబద్ధ ప్రణాళికగ గాని, శిక్షణగ గాని రూపొందియుండక పోవచ్చును. కాని దాని అస్తిత్వముండెను. ఈయోగము నాడు ఏ స్వరూపములోనున్నను దానిపై గీతలకు ద్వేషము గాని, ఈర్ష్యగాని లేదు. దానికి తమలో స్థానమిచ్చినవి. ఆరవ అధ్యాయములో ఈవిధమైన యోగి తపస్వులకన్నను, కర్మిష్టులకన్నను, జ్ఞానుల కన్నను శ్రేష్టుడనబడెను (6–46). ఏకాంతమునందు మనసు, యింద్రియముల క్రియలను నిలిపి, సిరస్సును, మెడను, శరీరమును అచలముగను, స్థిరముగను జేసుకొని, శాంతమునొంది, చిత్తశుద్ధి కొరకు యోగమును అభ్యసించవలెను. పాపరహితుడై నిత్యము యోగము నభ్యసించు వానికి బ్రహ్మస్పర్శయొక్క ఆత్యంతిక సుఖప్రాప్తి కలుగును. ఈవిధమైన యోగులు సహితము కర్మను త్యజించుటకు గీతలు సమ్మతింపవు. అర్జునులు యోగికావలెను. కాని దాని అర్థము వారు యుద్ధము నుండి విముఖులగుట కాదు కదా! ఎవడయితే తన కర్తవ్యకర్మల నన్నిటిని చేయుచు, ఏకత్వ భావనలో నిమగ్నుడై వుండునో –అలాటి యోగిని గీతలు ప్రశంసించు చున్నవి. అట్టి యోగసాధకుడు భగవానునికి ప్రియుడట! (6–46,47)

6. జ్ఞానమార్గము

జ్ఞాన యోగమును, జ్ఞానులను గీతలు ముక్తకంఠముతో ప్రశంసించినవి. జ్ఞానమును మించి పవిత్రము చేయునది మరొకటి లేదు. (4–38). జ్ఞానాగ్ని సంపూర్ణముగ కర్మలను భస్మము చేయుచున్నది (4–37). జ్ఞాని చూచుచు, వినుచు, తగులుచు, వాసన చూచుచు, తినుచు, నిశ్వాస ఉచ్ఛ్వాసములను విడచి తీసుకొనుచు, నిద్రించుచు ప్రకృతి యొక్క మూడు గుణములే

ఈకర్మల నన్నిటిని చేయుచున్నవని ఎల్లప్పుడు భావించుకొనుచుండును (5–8,9) భక్తులందరికన్నను "జ్ఞానీభక్తుడు" భగవానునకు ప్రియుడట! (7–17). అన్ని కోరికలను త్యజించి మమత, అహంకారరహితుడై ఏపురుషుడు (స్త్రీ) నడచు చున్నాడో – వానికి శాంతి లభించును. ఈస్థితియే బ్రాహ్మీస్థితి అనబడుచున్నది. ఈస్థితి కలిగిన మోహము నష్టమగు చున్నది (2–71,72) కాని యిటువంటి నిస్పృహ జ్ఞానులకు కూడ గీతల మతములో కర్మలను త్యజించుటకు అధికారము లేదు. కృష్ణ భగవానులు చెప్పుచున్నదేమనగా – వారికి (జ్ఞానులకు) చేయునది ఏదియు శేషించుట లేదు. వారికి అప్రాప్తమైన వస్తువు ఏదియు లేదు. అయినను, వారు ఉదాహరణార్థము, లోకసంగ్రహార్థము, లోకము ఎదుట కర్మలు చేయుచున్నారు (3–17,18,20)

అనేక యుక్తులను ప్రయోగించి గీతలు "కర్మ ఆవశ్యక" మను పక్షమును సమర్థించినవి. మొదటిది అశేషముగ కర్మలను త్యజించుట మానవునకు అసంభవము. ఒక్కక్షణమైనను ఎవ్వడు కర్మచేయక వుండలేడు. ప్రకృతి గుణములచే వివశుడై ప్రతి ఒక్కడు కర్మ చేయుచునే వున్నాడు. బ్రతుకు తెరువుకు, శరీర నిర్వహణకు కర్మసహాయము లేకుండ ఎవ్వడు తనను తాను రక్షించుకొనలేడు (3–5,8) . ఇక రెండవ సంగతి – అందరు కర్మను మానిన ఎడల సృష్టి చక్రము యొక్క నడక బంధింపబడును. యజ్ఞ సహితముగ ప్రజలను సృష్టించి ప్రజాపతి అన్నదేమనగా– దీని ద్వారా మీరు దేవతలను సంతుష్టపరచుడు. బదులుగా దేవతలు మీకోరికలను తీర్చెదరు. కర్మ వేదములనుండి పుట్టినది. వేదములు బ్రహ్మచే పుట్టించబడినవి. అందుచే సర్వవ్యాప్తమైన బ్రహ్మము యజ్ఞమునందు ప్రతిష్ఠితుడైయున్నాడు. ఈవిధముగా బ్రహ్మచే ప్రవర్తింపబడిన ఈజగచ్చక్రమును ఎవరు అనుసరింపరో – వారు పాతకులు. ఎవరు తమ కొరకే పచనము చేసుకొను చున్నారో – వారు పాపమునే తినుచున్నారు. ఎవరు యజ్ఞావశిష్టమును భుజించు చున్నారో – వారు పాపము నుండి విడుదలగు చున్నారు (3–10 నుండి 16).

యజ్ఞ, దాన, తపాది కర్మలు విడువరాని వనియు, అవి విద్వాంసులను పావన మొనరించుననియు శ్రీకృష్ణుల నిశ్చిత మతము (18–5,6) మనోబుద్ధుల చేతను, కేవలములైన యింద్రియములతోను యోగులు ఆసక్తిని త్యజించి, ఆత్మశుద్ధికొరకు కర్మ చేయుచున్నారు(5–11) కర్మ

చేయకుండా వుండుట అసంభవముగాన, చిత్తశుద్ధిని కలిగించు యజ్ఞాది కర్మలు కర్తవ్యములేగాని విడువదగినవి కావు. ఈవాదము బ్రాహ్మణయుగ పునర్జీవముగ గావ్పించును. కాని వాస్తవముగ గీతోక్త కర్మవాదమునకు, బ్రాహ్మణముల కర్మకాండకు మహత్తర భేదము గలదు. గీతలకు వేదముల మనోహర (పుష్పితా) వాణి నచ్చలేదు. "అర్జునా! వేదములు త్రైగుణ్యాక విషయములు. నీవు మూడు గుణములను అతిక్రమించుము" (2–45) నాలుగవ అధ్యాయములో కొన్ని యజ్ఞములు వర్ణింపబడినవి. వాటిని చేయుటకు ద్రవ్యపదార్థము అవసరము లేదు. ద్రవ్యయజ్ఞ, తపోయజ్ఞ, స్వాధ్యాయ యజ్ఞ, జ్ఞాన యజ్ఞాదులను వర్ణించిన తరువాత ద్రవ్యయజ్ఞము కంటె జ్ఞానయజ్ఞము శ్రేష్టమైనదని గీతలు ప్రకటించినవి. సర్వకర్మలు జ్ఞానము నందే అంతమగు చున్నవి. ఆజ్ఞానమును తత్వదర్శకుల వద్ద వినమ్రులమై నేర్చుకొనవలయును. (4–33,34) ఈవిధముగా గీతలు యజ్ఞముల యొక్క బహిర్ముఖతను తొలగించుటకు ప్రయత్నించినవి.

"కర్మఫలము నశించనంత వరకు ముక్తి కలుగ"దను భారతీయ దర్శన విచారకుల మూల సిద్ధాంతమును గీత లొప్పుకొనుచున్నవి. కాని ర్మఫలము నుండి విడుదలై పోవుటకు వాటికి తనదైన విశిష్ట మతము లదు. జ్ఞానమార్గాను సారము కర్మఫలము నుండి విముక్తి కలుగుననుటలో సందియము లేదు. జ్ఞానమును మించి పవిత్రము చేయునదిలేదని గీతలు జ్ఞానము యొక్క మహత్తును స్వీకరించు చున్నవి. అయితే గీతల అభిప్రాయములో జ్ఞానమార్గము, కర్మమార్గము – ఈరెండింటిని బాలకులే భిన్నములని అందురుగాని విద్వాంసులు కాదు. ఏ ఒక్కదానిలో వున్నను రెండింటి యొక్క ఫలమును పొందు చున్నాడు (5–4). కర్మఫలము నుండి విడుదలై పోవుటకు కర్మను విడనాడవలసిన అవసరములేదు. ఎవడైతేకర్మఫలమునందు ఆసక్తిని త్యజించి తన కర్తవ్య కర్మలను చేయుచున్నాడో – అతడే సన్యాసి. అతడే యోగి. అగ్నిని విడుచువాడు, క్రియాహీనుడు ఏమియును కాడు (6–1). కామ్యకర్మల త్యాగమునే విద్వాంసులు సన్యాసమను చున్నారు. సర్వకర్మ ఫలముల త్యాగమునే మనీషులు త్యాగమను చున్నారు. ఎవడయితే కర్మ ఫలములను వదలు చున్నాడో – వాడే వాస్తవముగా త్యాగి అనబడుచున్నాడు (18–2,11) కావుననే శ్రీ కృష్ణులవారు అర్జునులతో చెప్పుచున్నారు. "కర్మయందే నీకు అధికారము కలదు. ఫలితముపై ఎప్పటికిని లేదు. నీవు కర్మ ఫలితములకు హేతువు కారాదు. అకర్మణ్యత (కర్మను ఆచరించక పోవుట) యందు నీకు

సక్తి కలుగరాదు" (2–47). గీతలు కర్మత్యాగము నకు బదులు కర్మలో త్యాగమును ఉపదేశించు చున్నవి.

నిష్కామ భావనతో ఫలాసక్తిని త్యాగము చేసి కర్తవ్యకర్మలను చేయుట – ఈతరహా "చేత"ను ఉపదేశించుటయే గీతల స్వతంత్ర ఉపదేశము.

7. భక్తి మార్గము

జ్ఞానమార్గము నకు చెప్పినట్లుగనే గీతలు భక్తి మార్గము నకు కూడ ఈతరహా "చేత"ను జోడించినవి. కర్తవ్యాకర్తవ్యములకు శాస్త్రములే ప్రమాణములని సెలవిచ్చి శాస్త్రములను తగురీతిని సమర్ధించి, గౌరవించినవి. గీతల యొక్క సహిష్ణుతకు, వివిధ ఆస్తిక సిద్ధాంతములను సమన్వయించుటలోని ఉద్రేకము నకు ఈవాక్యమే తార్కాణముగ నున్నది.

"ఫలాసక్తిని విడిచి కర్తవ్య కర్మలను చేయవలె" నని గీతల ఉపదేశమైనను, దీని మించిన ఆగ్రహమేమనగా – భగవానుని ప్రసన్నత కొరకు ఫలాపేక్షను వారికే అర్పించి కర్మ చేయవలెను (9–27,28) దీని వలన కలుగు భక్తి భావన సాధకుని జీవితమును అతి సరసముగను, ఉత్సాహవంతముగను జేయును. అభిలాష శూన్యమైన నిష్కామకర్మ జీవితమునకు నిరుద్దేశ్యముగ గానబడును. బహుశా నిరుద్దేశ్యముగా జీవితమును గడపుట మానవుని పురుషార్ధభావనకు విరుద్ధమేమో! ఏలన దీనిలో హృదయము, బుద్ధి – ఇచ్ఛావృత్తి, సంకల్ప వృత్తులకు స్థానము లేదు. భగవానుని సంతుష్ట పరచవలెననెడి ఉద్దేశ్యము ఒక్కమారుగా జీవితమునకు సార్ధకతను, పవిత్రతను కలిగించి మానవుడు ఉచ్ఛస్థితిని జేరుకొనుటకు సహాయభూతమై నడుపును.

భగవానుని కొరకే కర్మచేయువాడు, ఆసక్తి రహితుడు, ప్రాణులన్నిటి యందు వైరము లేనివాడగు భక్తుడు భగవానునే జేరుకొనుచున్నాడు (11–55) మనసును భగవంతుని యందే నిలుపవలయును. వారినే చూడవలెను. వారి కొరకే యజ్ఞము చేయవలెను. వారికే నమస్కరింపవలెను. ఈ విధముగా భగవానుని యందు తనను తాను లగ్నము జేసుకొని, వారినే అనుసరించు (పరాయణః) భక్తుడు భగవానునే జేరుకొను చున్నాడు (9–

34). భగవానుని ఆశ్రయించిన పురుషుడు కర్మలనన్నిటిని చేయుచు భగవదనుగ్రహము వలన శాశ్వత పదమును పొందును (18–56) సమస్తకర్మలను విడచి భగవానుని శరణ పొందవలెను. భగవానుడే అతనిని సమస్త దోషముల నుండి విడిపించును. విచారించ వలసిన పనిలేదు (18–66)

అహంకారముతో యుద్ధము చేయనని అర్జునుల వారి నిశ్చయము శుద్ధ అబద్ధము. ఏలన వారి క్షత్రియ స్వభావము వారిని బలవంతముగ యుద్ధమున ప్రవర్తింపజేయును (18–59)

8. గీతాశిక్షణ

మతవాదులుగానివారు, పక్షపాతమనెడి విషముచే కలుషితముగాని బుద్ధిగలవారగు జిజ్ఞాసువులకు, సాధకులకు గీతల శిక్షణ జలపాతము వలె ఉజ్వలము (ప్రకాశవంతము) గను, స్పష్టముగను గానబడును. గీతాకారుడు ఎక్కడను తన అభిప్రాయమును దుస్సాధ్యముగను, కఠినముగను జేయుటకు ప్రయత్నించలేదు. రహస్యమనునదే లేదు. ఉన్నదేదో స్పష్టముగ నున్నది. సాహిత్య దృష్టితో జూచినను గీతలశైలి స్వాభావికతను, సానుభూతిని కలిగి సులభభాషతో నొప్పారుచున్నది. గీతలు సాధకుని ఆజ్ఞాపించుటతో ఆగక, అతని కష్టసుఖములలోను, యిబ్బందులలోను హృదయమును స్పృశించు సానుభూతిని ప్రదర్శించు చున్నవి. కృష్ణభగవానులు మనసును నిగ్రహించుట అతికఠినమైన శంగతని అంగీకరించుచున్నారు. అయినను వారిధోరణి ఆశావాదము. అభ్యాస, వైరాగ్యములతో మనసును నియమింప వీలగునని పలుకును (6–35) నిరాశ, అధైర్యములను ఎక్కడను స్ఫురింపనీయరు. ఆది నుండి అంతము వరకు అర్ధముగాని దేదియో అర్ధమగుచున్నట్లు తోచుట గీతల యొక్క విశిష్టత. మహత్తు. ఆ ప్రవాహమున బడి ఎక్కడను ఆగక కొట్టుకొని పోవుచుందుమే గాని – అట్లుకొట్టుకొని పోవుచున్నామే అనెడి భయము కలుగదు. అధైర్యము, నిరాశ, అర్ధముకాక పోవుటలు జనించవు. గీతలలో మనము ఎంతలోతుకు మునిగినను, అంతుదొరకు చున్నట్లే అనిపించు చుండును. కొంచమైనను విసుగు, అలసటలను దరిజేరనీయని అపారసానుభూతిని ప్రదర్శించుటలో గీతలకు గీతలేసాటి. ఇట్టి ప్రభావ పూర్ణమైన, పరమార్ధచింతగల సాహిత్యము దొరకుట దుర్లభము. "అర్జునా! మంచిపని జేయువాడు ఎన్నటికిని దుర్గతిపాలుగాడు" (6–40). "ఈధర్మము కొంచమనుష్టించినను పెద్దభయముల (కష్టముల) నుండి

క్షించును" (2–40). గీతావక్తకు సత్యము మరియు ధర్మముల శక్తియందు ార్తి నమ్మిక కలదు. ఆనమ్మకమే గీతా పాఠకులకు ఉత్సాహమును, శక్తిని ిగించును.

గీతలు హిందూ ధర్మము, హిందూ దర్శనము యొక్క ప్రతినిధి ంథము. ధర్మములన్నిటి కంటె హిందూ ధర్మము యొక్క గొప్పదనము ాని పరమత సహిష్ణుత. అదే గీతల విశేష గుణము. వివిధ మతాంతరములను మన్వయించుట, ప్రపంచ సిద్ధాంతములలోని సత్యాంశములను గ్రహించి వలంభించుట హిందూజాతికి, హిందూ ధర్మమునకు స్వాభావికము. శత్రువుల ుండి పాఠములను నేర్చుకొనుట దాని నైజగుణము. ఇట్టి సుందర, స్వభావము వలన విదేశీయుల అజస్ర ఆక్రమణ (దండయాత్ర)లకు ురైనను, పరాధీనతలో నుండినను – హిందూజాతి నేటికిని జీవించి యున్నది. వట్టివాద వివాదములలోనే చిక్కుకొని యుండక, హిందూ బుద్ధి ఎల్లప్పుడును సత్యమును ముట్టుకొనుటకు, అన్వేషించుటకు ప్రయత్నము చేయుచునే యున్నది. పరమార్థ చింత, ఆస్తికత మనకు వినోదార్థముగాని, ోచకగాని, ఊసుపోకకుగాని కాదు. అది మన జీవితము యొక్క గంభీర విషయముగను, పురుషార్థముగను పరిగణింపబడుచు వచ్చినది. మహాభారతమును గురించి "యిందు లేనిది మరెక్కడనులే" దని చెప్పుచున్నారు. ఆర్యుల విచార సాహిత్యము (ఉపనిషత్ సాహిత్యము) లో ఏది సుబోధకరముగను, సుఖోపేతముగను వున్నదో దానిని గీతలు సంగ్రహించి తమలో యిముడ్చుకొన్నవి. హిందూజాతి జాగృతమైన నేటి యుగములో గీతల పై ఆసక్తి కలుగుటలో ఆశ్చర్యము లేదు.

9. నిర్గుణోపాసన

నిర్గుణోపాసనను మెచ్చుకొనుచు, అది ఒక హద్దు వరకే సాధ్యమని గీతలు అభిప్రాయపడినవి. శూన్యములోనే శూన్యమగుటకు గీతలు అంగీకరింపవు. ఆశూన్యము యొక్క మహత్తుశూన్యమగుట కంటె – అది కాకుండా వుండుటలోనే వున్నది. దాని కొరకే సాధిక అవసరము. అందుచే గీతలు అవ్యక్తోపాసనను అనవసరమని స్పష్టముగ జెప్పక, ఆఅవ్యక్తమే వివిధ రూపములతో వ్యక్తమగుటయే శ్రేయమని, సృష్టివలనగాన వచ్చు చుండుట వలన – ఆ అవ్యక్తమునే ఆధారముగ తీసుకొని, వ్యక్తసాధనకే ప్రాముఖ్యత